పేదల బియ్యం.. తమ్ముళ్లు తినేస్తున్నారు..



రేషన్ బియ్యం నిల్వలు
(పాత చిత్రం)

ఐదేళ్లు వైసీపీ నేతల కనుసన్నల్లో రేషన్ బియ్యం దందా సాగింది. అధికారం మారింది.. బియ్యం వ్యాపారులు మారారు. అంతే అక్రమాలు మాత్రం అప్పటిలాగానే కొనసాగుతుండటం గమనార్హం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు బియ్యం చీకటి వ్యాపారం నిర్వహించడం కొన్ని ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అధికార పార్టీ నేతలు కొందరు బియ్యం అక్రమ వ్యాపారాన్ని వారి అదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. వైసీపీ పాలనలో పెద్ద ఎత్తున బియ్యం బ్లాక్ మార్కెట్ జరిగింది. అప్పట్లో బియ్యం అక్రమ నిల్వలను ప్రతిపక్ష నేతలు పట్టించారు. బియ్యం అక్రమ వ్యాపారంపై పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. అధికారం మారగానే బియ్యం అక్రమ వ్యాపారం నిరోధిస్తారని ప్రజలు భావించారు. అప్పటి లాగానే బియ్యం నల్లబజారుకు తరలిపోతున్నా నాడు ప్రతిపక్షంలో విమర్శలు చేసిన నేతలు నోరు మెదపకపోవడంతో ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. మాటలే చేతల్లో ఉండదని నేతలను ప్రజలు విమర్శిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

- అక్రమార్కులకు అధికారం అండ
- అక్కడ నెలకు రూ. 28 లక్షలివ్వాలంట
- అధికారుల తీరుపైనా విమర్శలు
- సమాచారం ఇచ్చినా స్పందించని వైనం
- ఉమ్మడి జిల్లా బియ్యం డాన్ ప్రసాద్
- టోకుగా కేజీ రూ. 28కి కొనుగోలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పౌరసరఫరాల శాఖ మంత్రి ఇలాకాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతి నెలా వేలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలిపోతున్నాయి. రేషన్ సరఫరా చేసే ఎంయూడీ వాహనం వద్దే బహిరంగంగా కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఒక పట్టుపాలిష్ వేసి, గోతాలు మార్చి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. నెలకు రూ కోట్లల్లో ముడుపులు చేతులు మారుతున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతోనే బియ్యం అక్రమ వ్యాపారం విరాజిల్లుతోంది. కార్డు దారులకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం నిల్వల్లో సగం వరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్టు అంచనా. ఇదంతా బహిరంగానే జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోరు. కొందరు అధికారులకు.. కొందరు అధికార పార్టీ నేతలకు నెలవారీ మాములు ఇస్తున్నారనేది బహిరంగ రహస్యమే. రేషన్ పంపిణీపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నెలవారీ తనిఖీలు నిర్వహించడాన్ని కూడా వారు విస్మరించారు.

గుజరాత్‌కు తరలిపోతున్న బియ్యం నిల్వలు

మండల, నియోజకవర్గ స్థాయి వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. గతంలో కాకినాడ పోర్టుకు బియ్యం నిల్వలు తరలించేవారు. ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ కాకినాడ పోర్టులో తనిఖీలు నిర్వహించి వేలాది క్వింటాళ్ల బియ్యం అక్రమ నిల్వలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో బియ్యం బ్లాక్ మార్కెట్ రూటు మారింది. జిల్లాలో సేకరించిన బియ్యం నిల్వలను ప్రస్తుతం గుజరాత్‌కు తరలిస్తున్నట్టు అక్రమార్కులు బహిరంగానే చెబుతున్నారు.

ప్రతి నెలా రూ. 22 కోట్ల వ్యాపారం

ఉమ్మడి జిల్లాలో 14,91,277 తెల్ల కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 2,04,850 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారు. వీటిలో 40 నుంచి 50 శాతం బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు ఒక అంచనాగా ఉంది. అంటే దాదాపు 90 వేల నుంచి లక్షల క్వింటాళ్ల వరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్టు అక్రమార్కుల చెబుతున్న లెక్కలు తెలియజేస్తున్నాయి. పల్నాడు జిల్లాలోని ఒక నియోజక వర్గానికి నెలకు 13,971 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది. అయితే ఒక ముఠా 250 టన్నులు, మరో ముఠా సుమారు 150 టన్నులు బియ్యం డీలర్ల నుంచి సేకరించి బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్టు ప్రచారం. ప్రభుత్వం కార్డు దారులకు సరఫరా చేసిన నిల్వల్లో దాదాపు 40 శాతం బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్టు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 8 వేల టన్నుల వరకు బియ్యం నిల్వలు జిల్లా సరిహద్దు దాటిపోతున్నాయనేది ఒక అంచనాగా ఉంది. టోకు వ్యాపారి కిలో రూ. 28 బియ్యం కొనుగోలు చేస్తుండగా దీని ప్రకారం దాదాపు ప్రతి నెలా రూ 22 కోట్లకు బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతున్నట్టు అంచనా.



నరసరావుపేటలోని వినుకొండ రోడ్డులో బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా పోలీసులకు పట్టించిన బియ్యం ఉన్న వాహనం

బ్లాక్ మార్కెట్ కట్టడి చేసేనా?

ఉమ్మడి జిల్లాలో వైసీపీ హయాంలో పెద్దఎత్తున బియ్యం బ్లాక్ జరిగింది. అదే వరవడిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అక్రమార్కులు కొనసాగిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం పేదల బియ్యం బ్లాక్ మార్కెట్‌ను పూర్తిగా నిరోధిస్తుందని ప్రజలు భావించారు. రెండు నెలలు గడిచినా బియ్యం బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాకు చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారు. అయన కాకినాడ పోర్టులో తనిఖీలు నిర్వహించి వేలాది టన్నుల బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే తరహాలో ఉమ్మడి జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నరసరావుపేటలో 50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

నరసరావుపేట లో 50 బస్తాల రేషన్ బియ్యం నిల్వలను రూరల్ పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం ఇక్కడి వ్యాపారులకు కాకుండా ప్రకాశం జిల్లాకు తరలిస్తున్నారన్న సమాచారంతో ఇక్కడి కొందరు ఓపార్టీ కార్యకర్తలు వినుకొండ రోడ్డులో రాత్రి 10 గంటల సమయంలో కాపుకాసి బియ్యం తరలిస్తున్న ఆటోను అడ్డుకున్నారు. ఈ మేరకు సదరు వ్యక్తులు రూరల్ పోలీసులకు సమా చారం ఇచ్చారు. రూరల్ పోలీ సులు బియ్యం నిల్వ ఉన్న అటోను పోలీసు స్టేష న్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్నాడులో రెండు ముఠాలు..

పల్నాడు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి బియ్యం డీలర్ల నుంచి కొనుగోలు చేశారు. ఒక ముఠా కిలో రూ 13, మరో ముఠా కిలో రూ 15 నుంచి 16కు కొనుగోలు చేశారని నియోజకవర్గం మొత్తం కోడైకూసింది. ఇక్కడ ఒక ముఠాలో దాదాపు 10 మంది సభ్యులు ఉండగా ఒక్కొక్క వ్యక్తి రూ 5 నుంచి 7 లక్షలు పెట్టుబడి వ్యయంగా ఒక నేత వద్ద ఉంచినట్టు తెలిసింది.

బియ్యం బ్లాక్ మార్కెట్ ఇలా..

కార్డు దారుల నుంచి డీలర్లు కిలో రూ 8 నుంచి రూ 10 వరకు కొనుగోలు చేస్తున్నారు. వీరి వద్ద నుంచి మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కులు డీలర్ల వద్ద కిలో రూ 13 నుంచి రూ 16 వరకు కొనుగోలు చేస్తేన్నారు. మండలాల వారీగా స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేసుకొని రాత్రి వేళ్లలో అక్రమార్కులు ఆటోలు వంటి చిన్న వాహనాల్లో డీలర్లు నుంచి బియ్యం సేకరిస్తున్నారు. ఇలా నిల్వలను స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నారు. కొన్ని చోట్ల మిల్లులను లీజుకు తీసుకొని సేకరించిన బియ్యంకు ఒక పట్టు పాలిష్ వేసి గోతాలు మారుస్తున్నారు. 25, 50 కేజీల ప్యాకింగ్ చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయి వ్యాపారుల నుంచి టోకు వ్యాపారి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. టోకు వ్యాపారి కిలో బియ్యం రూ 28 కొనుగోలు చేస్తున్నాడు. డీలర్ నుంచి టోకు వ్యాపారి వరకు బియ్యం నెలవారీగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. అక్రమార్కులు పోటీ పడ్డ చోట డీలర్లకు రేటు ఎక్కువగా లభిస్తున్నట్టు తెలిసింది.

బియ్యం డాన్.. గుంటూరు ప్రసాద్ ?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టోకుగా బియ్యం కొనే వ్యక్తి గుంటూరుకు చెందిన ప్రసాద్‌గా తెలుస్తోంది. ఇతనికి అక్రమార్కులు బియ్యం డాన్... గుంటూరు ప్రసాద్‌గా పిలుచుకుంటారు. ఈ వ్యక్తి నియోజకవర్గాల వారీగా అక్రమార్కుల వద్ద నుంచి బియ్యం కిలోకు రూ. 28 చెల్లించి కొనుగోలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఇతని కింద చాలా నియోజకవర్గాలు ఉన్నట్టు తెలిసింది. సత్తెనపల్లి మండలం కొమెరపూడి, పేరేచర్లలో సదరు వ్యాపారి స్టాక్ పాయింట్‌లు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సేకరించిన బియ్యం నిల్వలను ఆయా స్టాక్ పాయిం ట్‌ల నుంచి గుజ రాత్‌కు తరలిస్తున్నట్లు ప్రచారం. వైసీపీ పాలనలోనూ ఈ ప్రసాద్ ఐదేళ్ల బ్లాక్ మార్కెట్ నిర్వహించాడని, అతనే ఇప్పుడు కూడా కొనసాగుతున్నట్టు చెబుతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా బియ్యం బ్లాక్ మార్కెట్ చేసిన వ్యాపారులనే కొందరు నేతలు కొనసాగిస్తుండటాన్ని అధికార పార్టీలో కొందరు నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. మండలాలు.. నియోజక వర్గాల వారీగా బియ్యం బ్లాక్ మార్కెట్ చేసుకొనే అవకాశాన్ని కొందరు వ్యాపారులకు నాయకులు కట్టబెట్టినట్టు టీడీపీ వర్గాలే ప్రచారం చేస్తున్నాయి.

అక్కడ నెలకు రూ. 28 లక్షలు

బియ్యం అక్రమ వ్యాపారంలో ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాలు మినహా చాలా చోట్ల అధికార పార్టీ నేతలు అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుంటు న్నట్టు పార్టీ వర్గాలే ప్రచారం చేస్తున్నాయి. ఒక చోట బియ్యం అక్రమ వ్యాపారం నిర్వహణకు నెలకు రూ. 28 లక్షలు చెల్లిస్తు న్నట్టు ప్రచారం జరుగుతోంది. మరికొన్ని చోట్ల నెలకు రూ..20 లక్షల వరకు చేతులు మారుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. కొన్ని శాఖల అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్టు తెలిసింది. ఒక శాఖలోని కొందరు అధికారులకు ఒక్కొక్క చోట నెలకు రూ 2.50 లక్షల నుంచి రూ 4 లక్షల వరకు మామూళ్లు చెల్లిస్తు న్నట్టు తెలుస్తోంది. మరో శాఖకు సంబంధించి నెలకు ఒక్కొక్క చోట నెలకు రూ 50 వేల వరకు ఇస్తున్నారని ప్రచారం. దీంతో అక్రమార్కులు నిర్వహించే బియ్యం బ్లాక్ మార్కెట్ నిరాటంకంగా సాగుతుందని చెబుతున్నారు.

అధికారులపై అధికార పార్టీ ఒత్తిళ్లు

బియ్యం అక్రమ వ్యాపారం, బియ్యం రీసైక్లింగ్ జరిగే మిల్లులు వీటి చిరునామాలతో సహా సమాచారం ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడరు. కొందరు అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నా కొందరు అధికారులు బియ్యం బ్లాక్ మార్కెట్‌పై స్పందించి తనిఖీలు నిర్వహించినా చర్యలు తీసుకొనే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. వీరిపై అధికార పార్టీ ఒత్తిడి ఉండటం జగమెరిగిన సత్యమే. బ్లాక్ మార్కెట్ చేస్తోంది అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావడంతో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మిన్నకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల పల్నాడు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో రెండు ముఠాలుగా నేతలు విడిపోయి బియ్యం వ్యాపారం నిర్వహించారు. ఒక ముఠాకు సంబంధించి బియ్యం నిల్వ చేసిన మిల్లుపై మరో ముఠా విజిలెన్స్ అధికారుల చేత దాడులు చేయించింది. అయినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తనిఖీలకు వచ్చిన అధికారులు మిల్లులో బియ్యం నిల్వలు లేవని వెల్లడించడం గమనార్హం.

బడి బస్సులకు.. ఫిట్‌నెలెస్

- ప్రైవేట్ స్కూల్ బస్సులతో పరేషాన్
- కాలం చెల్లిన వాహనాల వినియోగం
- పరిమితికి మించి విద్యార్థుల తరలింపు
- బడి పిల్లల భద్రత ప్రశ్నార్థకం
- నిద్రావస్థలో రవాణాశాఖ

ఆకర్షణీయమైన హంగులు.. వేలకు వేలు ఫీజులు.. మాటలతోనే సరికొత్త లోకాన్ని కళ్ల ముందు చూపిస్తారు.. ర్యాంకులు పంట మా వెంట అంటూ ఊదర గొడతారు.. అవసరమున్నా లేకున్నా అది ఇది అంటూ ఏదేదో చెప్పి అదనపు ఫీజులూ వసూలు చేస్తారు.. తమ బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. అయితే అక్కడ చదువు సంగతి పక్కన పెడితే విద్యార్థుల భద్రతే గాలిలో దీపంగా మారుతోంది. ఆయా విద్యాసంస్థల వాహనాల ఫిట్‌నెస్‌పై ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని యాజమాన్యాలు కాలం చెల్లిన బస్సులలో యథేచ్ఛగా విద్యార్థులను తిప్పుతూ నిబంధనలకు పాతరేస్తున్నారు.

గురజాలటౌన్, ఆగస్టు 25: మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కాలం చెల్లిన బస్సుల్లోనే విద్యార్థులను పాఠశాలకు తరలిస్తున్నారు. మండలంలో మొత్తం 8 ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిల్లో 32 దాకా బస్సులు ఉన్నాయి. వీటిలో చాలా వరకు కాలం చెల్లిన బస్సులు తిరుగుతున్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 5 వేల మంది దాకా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి బస్సులో సీటింగ్ కు సరిపడా సంఖ్యలో మాత్రమే విద్యార్థులను ఎక్కించాలనే నిబంధన ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. సీటింగ్ కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నా రు. దీంతో చాలా మంది విద్యార్థులు బస్సులో నిల్చోనే పాఠశాలలకు వెళ్లా ల్సి వస్తోంది. దీనికితోడు బస్సు డ్రైవ ర్లు కక్కుర్తి పడి ఆయా గ్రామాల మధ్యన ప్రయాణికులను సైతం ఎక్కిస్తూ చార్జీ రూపేణా డబ్బులు వసూలు చేస్తున్నారు. అదేమని అడి గితే టీ, టిఫిన్ ఖర్చులంటూ సమర్థించుకుంటున్నారు. కాగా వేరే మండలాల్లోనే స్కూల్స్, కాలేజీల పేర్లు మీద బస్సులను తీసుకొచ్చి ఇక్కడ పాఠశాలల యాజమాన్యం వినియోగించుకుంటోంది.



వెనుక వైపు అద్దం లేకుండా తిరుగుతున్న స్కూల్ బస్సు



స్కూల్ బస్సులో నిల్చొని వెళ్తున్న విద్యార్థులు

పట్టించుకోని అధికారులు...

ఇంత జరుగుతున్నా రవాణా శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌లపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ప్రధాన రహదారుల్లో పరిమితికి మించి విద్యార్థులు ప్రయాణిస్తున్నా తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే చిన్నారుల జీవితాలు బలైపోయే ప్రమాదం ఉంది. గతేడాది 2023 జనవరి 7వ తేదీన మండలంలోని పులిపాడు, గంగవరం గ్రామాల మధ్య రాళ్ల వాగు సమీపంలో ఓ స్కూల్ బస్సు రోడ్డు పక్కన లోయలో పడిపోయింది. బ్రేక్ ఫెయిల్ అవడమే ఇందుకు కారణంగా గుర్తించారు. అయితే ఆ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



లోయలో పడిన ప్రైవేటు స్కూల్ బస్సు (పాత చిత్రం)

పర్యాటకుల సందడి



మాచర్ల రూరల్, ఆగస్టు 25: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. విజయపురిసౌత్‌లోని లాంచీ స్టేషన్ నుంచి లాంచీల ద్వారా పర్యాటకులు కొండకు చేరుకున్నారు. కొండలోని మ్యూజియంలో గల బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్థూపం సందర్శించారు. అలాగే అనుపులోని యాంఫీ థియేటర్, అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి దేవాలయం సందర్శించి అనంతరం 60 అడుగుల ఎత్తునుంచి జాలువారుతున్న ఎత్తిపోతల జలపాతం అందాలను వీక్షించారు. దీంతో లాంచీ స్టేషన్‌కు రూ. 70 వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

దివ్యాంగుల నకిలీ సర్టిఫికెట్లు

విచారణకు అదేశించిన కలెక్టర్



నరసరావుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో దివ్యాంగులకు ఇచ్చే ధ్రువ పత్రాలు నకిలీవి జారీ అయ్యాయి. వీటి ఆధారంగా కొందరు పింఛన్ పొందుతున్నట్టు వెలుగు చూసింది. దీనిపై స్పందించిన కలెక్టర్ అరుణ్‌బాబు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖకు లేఖ రాశారు. జిల్లాలో సూమారు 363 నకిలీ ధ్రువపత్రాలు జారీ చేసినట్టు ప్రాథమికంగా తేల్చారు. నరసరావుపేట, ముప్పాళ్ల, శావల్యాపురం, వినుకొండ, బొల్లాపల్లి మండలాల్లో నకిలీ ధ్రువపత్రాలతో దివ్యాంగుల పింఛన్ తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఈ ధ్రువ పత్రాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. విచారణలో నకిలీవి అని తేలితే పింఛన్ పొందుతున్న వ్యక్తులు, సర్టిఫికెట్లను జారీ చేసిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

నామినేటెడ్.. సందడి




- తెలుగు తమ్ముళ్లలో ఉత్కంఠ
- ఆశల పల్లకీలో ద్వితీయ శ్రేణి నేతలు
- పదవులు కోసం ఎమ్మెల్యేలపై నేతల వత్తిడి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నామినేటెడ్ పదవులు భర్తీపై తెలుగుదేశం అధిష్ఠానం దృష్టి సారించింది. త్వరలోనే పదవులు భర్తీ చేస్తారన్న సమచారంతో తెలుగు తమ్ముళ్లలో ఉత్కంఠ నెలకొంది. ద్వితీయ శ్రేణి నేతలు పదవుల పై ఆశలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యేలను కలసి పద వుల కేటాయించాలని కోరుతూ లేఖలు ఇస్తున్నారు. ఈ పదవులకు పోటీ తీవ్రంగానే ఉంది. దీంతో పద వుల పంపిణీ ఎమ్మెల్యేలకు తలనొప్పిగా పరిణమించ నున్నది. ఒక్కొక్క పదవికి ముగ్గురు నలుగురు పోటీ పడుతున్నారు.

మార్కెట్ యార్డు కమిటీలను నియమించాల్సి ఉంది. అర్బన్ అథారిటీ ఛైర్మన్ పోస్టును భర్తీ చేయాలి. దేవాలయ కమిటీలు, సొసైటీలు, నీటి సంఘాలలో పదవులను భర్తీ చేయాలి. నియోజకవర్గ, జిల్లా స్థాయి పదవులతో పాటు రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ ఛైర్మన్‌లు, వీటిలో డైరక్టర్లు ఇలా అనేక పదవులను భర్తీ చేయాల్సి ఉండగా వీటిలో పోస్టింగ్‌ల కోసం నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అర్బన్ అథారిటీ ఛైర్మన్ పదవుల కోసం ఇప్పటికే పార్టీలో సీనియర్ నేతలు ఎమ్మెల్యేల వద్ద సిఫార్సు లేఖలు తీసుకున్నారు. పల్నాడు అర్బన్ అథారిటీ ఛైర్మన్ కోసం పోటీ తీవ్రంగా ఉంది. ఈ పదవి కోసం పలువురు నేతలు ఎమ్మెల్యేల వద్ద సిఫార్సు లేఖలు తీసుకున్నారు. జిల్లాలో 12 మార్కెట్ యార్డులు ఉన్నాయి. నరసరావుపేట, రొంపిచర్ల, వినుకొండ, ఈపూరు, చిలకలూరిపేట, సత్తెనపల్లి, క్రోసూరు, రాజుపాలెం, మాచర్ల, దుర్గి, గురజాల, పిడుగురాళ్ల మార్కెట్ యార్డు పదవులను నేతలు ఆశిస్తున్నారు. యార్డు ఛైర్మన్‌లతో పాటు డైరెక్టర్ల పదవులు భర్తీ చేయాల్సి ఉంది. మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవులకు కొన్ని చోట్ల నేతల పేర్లను గుర్తించారు. యార్డు కమిటీలలో డైరెక్టర్ పదవులను కులాల సమీకరణలను పరగణలోకి తీసుకుంటున్నారు. ప్రముఖ దేవాలయాల పాలక మండలి కమిటీ లకు ఎమ్మెల్యేలు నేతల పేర్లను పరిశీలనలోకి తీసుకుంటున్నారు. సొసైటీలు, నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పార్టీ నేతలను అయా కమిటీలకు నియమించే అవకాశం ఉంది. ఈ పదవులను ఆశించే నేతల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఈ నెలాఖరుకు కొన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తారన్న సమాచారంతో ద్వితీయ శ్రేణి నేతలు పదవుల కోసం ప్రయత్నాల్లో ఉన్నారు. ఎవరిని పదవులు వరిస్తాయో చూడాలి.



దిక్సూచి
DIKSUCHI

"ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పౌరస్మృతిలో మతతత్వ ఛాయలు ఉన్నాయి. మతం ఆధారంగా వివక్షను ప్రోత్సహించేలా ఉంది. దాని స్థానంలో 'లౌకిక పౌరస్మృతి'ని తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కూడా అనేక సార్లు ఉమ్మడి పౌరస్మృతి గురించి చర్చించి, దీన్ని అమల్లోకి తేవాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఈ అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంటే ఏమిటి? చట్టాలు వ్యక్తిగతంగా ఉండాలా? మత పరంగా ఉండాలా? లేదా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తింప జేయాలా? అనే అంశాలను సమగ్రంగా చర్చిద్దాం.

ఉమ్మడి పౌరస్మృతి
'ఒకే దేశం - ఒకే చట్టం'

ఇండియన్ పాలిటీ

దొంగతనం, అత్యాచారం, హత్య... ఈ నేరాలు ఎవరు చేసినా వారి మతం, కులాలతో సంబంధం లేకుండా కోర్టులు శిక్షలు విధిస్తాయి. కానీ... పెళ్లి, విడాకులు, భరణం, దత్తత, వారసత్వం, మహిళలకు ఆస్తిహక్కు వంటి విషయాల్లో మాత్రం దేశ ప్రజలందరికీ ఒకే చట్టం వర్తించదు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వారి వారి పర్సనల్ లాస్(మతం ఆధారంగా కల్పించిన వ్యక్తిగత చట్టాలు) ఆధారంగా శిక్షలు ఉంటాయి. అలాగే రాష్ట్రాలవారీగానూ అనేక చట్టాలు ఉన్నాయి. అలా కాకుండా పెళ్లి, విడాకులు, దత్తత, వారసత్వం, ఆస్తిహక్కు వంటి వాటి విషయాల్లో రాష్ట్రాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఒకే చట్టం ఉండాలనే భావనకు ప్రతిరూపమే 'ఉమ్మడి పౌరస్మృతి'.

ఇతర దేశాల్లో ఉమ్మడి పౌరస్మృతి

- అమెరికాలో భిన్న మతాలను అవలంబించేవారు, భిన్న జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. అలాగని అక్కడ విడివిడిగా ప్రత్యేక చట్టాలు లేవు.
- ఫ్రాన్స్, జర్మనీ, చైనాలో కూడా మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.
- ఈజిప్ట్, మొరాకో, తుర్కియో వంటి ముస్లిం దేశాల్లోనూ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక చట్టాలు లేవు.

ఓ మైనర్ ముస్లిం బాలిక వివాహానికి సంబంధించి కేరళ హైకోర్టు ఇటీవల ఒక తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల లోపు వివాహం చేసుకునే హక్కు ఉందని బాలిక తండ్రి చేసిన వాదనను తిరస్కరించింది. ఏ వ్యక్తి

ముందు దేశపౌరుడు, ఆ తరవాతే మతం

అయినా ముందు దేశ పౌరుడని, ఆ తరవాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంటూ..... హిందువైనా, ముస్లిమైనా, క్రిస్టియన్ అయినా.... అందరికీ బాల్య వివాహ నిషేధచట్టం(2006) వర్తిస్తుందని కేరళ హైకోర్టు 28 జూలై 2024న స్పష్టం చేసింది.


పర్సనల్ లాస్

మన దేశంలో పౌరుల వ్యక్తిగత అంశాలైన పెళ్లి, ఆస్తులు, వారసత్వం, దత్తత వంటి వాటికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మతం ఆధారంగా రూపొందించారు. అవి... హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), హిందూ దత్తత నిర్వహణ చట్టం(1956); భారతీయ క్రైస్తవ వివాహ చట్టం(1957), భారత విడాకుల చట్టం(1969); పార్శీ వివాహ, విడాకుల చట్టం(1936), ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్(1937), ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ చట్టాలు, కశ్మీర్ సంప్రదాయ చట్టాలు మొదలైనవి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



ఎలిజిబిలిటీ టెస్ట్

రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్‌కి సంబంధించిన ఎలిజిబిలిటీ టెస్ట్ అనే ఈ టాపిక్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఎస్.ఐ., బ్యాంకింగ్ మొదలైన పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ముందుగా ఏదైనా ఉద్యోగానికి, కళాశాలలో ప్రవేశానికి, బ్యాంకులో లోన్ లభించడానికి మొదలైన వివిధ అంశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. తదుపరి వివిధ వ్యక్తుల వ్యక్తిగత సమాచారం (పర్సనల్ డేటా) తెలుసుకుంటారు. ఆ సమాచారంలోని అంశాలు ప్రశ్నలో ఇచ్చిన అర్హతలకు సరిపోయిందా లేదా పరిశీలించి దానిని బట్టి ఐచ్ఛికాలుగా ఎ, బి, సి, డి, ఇ లలో సరైన దానిని సమాధానంగా గుర్తించాలి. గ్రూప్ 1 కోచింగ్‌ను అందించే ఒక ప్రముఖ శిక్షణసంస్థలో ఉచిత కోచింగ్ ప్రవేశానికి విద్యార్థికి తప్పనిసరిగా కింది అర్హతలు ఉండాలి.

1. విద్యార్థి కచ్చితంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో తప్పనిసరిగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
2. విద్యార్థి వయసు 2023 మే 25 నాటికి 22 సంవత్సరాలకు తగ్గకూడదు, 30 సం॥లకు మించకూడదు.
3. విద్యార్థి సంరక్షకుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదు.
4. విద్యార్థి కోచింగ్ శిక్షణాకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు లేదా పరీక్ష తేదీ వరకు (ఏదీ ముందు జరిగితే అలా) తప్పనిసరిగా కోచింగ్ నిర్వాహకులు తెలిపిన విధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తూ శిక్షణసంస్థలోనే ఉండాలి.
5. ఆ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ఉద్యోగానికి ఎన్నికైతే తప్పనిసరిగా ఆ సంస్థకు 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ అంగీకారపత్రంపై సంతకం చేయాలి.
6. పై వాటిలో ఒకటో అర్హతకు బదులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 75% మార్కులు ఉన్నట్లయితే ఆ విద్యార్థి విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
7. పై వాటిలో అయిదో పాయింట్‌లో సూచించిన విధంగా అంగీకార పత్రానికి బదులు శిక్షణా కాలం జరుగుతున్న సమయంలోనే రూ.15,000/- చెల్లించడానికి సుముఖత తెలిపితే అభ్యర్థి విషయం కోచింగ్ సంస్థ (శిక్షణ సంస్థ) డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

పైన పేర్కొన్న అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి కింద ఇచ్చిన వివిధ విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఐచ్ఛికాల్లో తెలిపిన సమాధానాల్లో ఏది సరైనదో నిర్ణయించండి.

1. అవినాష్ ఎంటెక్ 70% మార్కులతో పూర్తి చేశాడు. పుట్టిన తేదీ 2002 జూన్ 1. అవినాష్ సంరక్షకుల వార్షికాదాయం రూ.96,000. అవినాష్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ దగ్గరే ఉండటానికి, అయిదో పాయింట్‌లో తెలిపినట్లు అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) అవినాష్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
బి) అవినాష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
సి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
డి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) అవినాష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (డి)

వివరణ: అవినాష్ పుట్టిన తేదీ 2002 జూన్ 1. ప్రశ్నలో తెలిపిన 2023 మే 25 నాటికి అవినాష్‌కి 21 సంవత్సరాలు మాత్రమే. వయసు సరిపోదు కాబట్టి అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు.

2. దినేష్ ఎమ్మే 56% మార్కులతో పూర్తి చేశాడు. అతను పుట్టినతేదీ 1996 ఆగస్టు 24. డిగ్రీలో అతనికి 82% మార్కులు లభించాయి. దినేష్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.93,000/-. శిక్షణ పూర్తయిన తరవాత పరీక్ష తేదీ వరకు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు.

ఎ) దినేష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) దినేష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) దినేష్ ఇచ్చిన సమాచారం సరిపోదు.
డి) దినేష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది ఇ) దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (ఇ)

వివరణ: దినేష్‌కు ఇచ్చిన అర్హతలలో 2, 3, 4, 5 అర్హతలు ఉన్నాయి. ఒకటో అర్హతకు బదులుగా 6వ పాయింట్‌లో తెలిపిన విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 82% మార్కులు పొందడం వలన దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

3. వికాస్ ఎమ్మెస్సీ 70% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.60,000/-. కోచింగ్ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దనే ఉండటానికి నిశ్చయించుకుని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) వికాస్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) వికాస్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) ఇచ్చిన సమాచారం సరిపోదు
డి) వికాస్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది
ఇ) వికాస్ విషయం శిక్షణాసంస్థ డైరెక్టర్ పరిశీనలకు వెళుతుంది

సమాధానం: (సి)

వివరణ: వికాస్ పుట్టినతేదీ గురించి ఎటువంటి సమాచారం లేదు.

4. తేజ ఎమ్మే 75% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.78,000/-. కాని శిక్షణ పొందడానికి 15,000/- చెల్లించడానికి అంగీకరించాడు. శిక్షణకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. కాని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేయలేదు. తేజ పుట్టిన తేదీ 1996 జూన్ 11.

ఎ) తేజ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
బి) తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
సి) తేజ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు డి) తేజ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) తేజ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (బి)

వివరణ: తేజకు ఇచ్చిన అర్హతలలో 1, 2, 3, 4 అర్హతలు ఉన్నాయి. అయిదో అర్హతకు బదులుగా ఏడో పాయింట్‌లో తెలిపిన విధంగా రూ.15,000/- చెల్లిస్తున్నందున తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

5. ప్రశాంత్ ఎంకామ్ 65% మార్కులతో పూర్తి చేశాడు. ప్రశాంత్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండడానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు. అతను పుట్టిన తేదీ 1994 ఏప్రిల్ 4. ప్రశాంత్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,20,000/-.

ఎ) ప్రశాంత్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
బి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అర్హుడు
సి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు
డి) ప్రశాంత్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు ఇ) ప్రశాంత్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (సి)

వివరణ: ప్రశాంత్ సంరక్షకుల వార్షికాదాయం రూ.1,20,000/-లు. మూడో అర్హతలో వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదని ఉన్నది. కాబట్టి ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

అటకెక్కిన 'ఫిష్ ఆంధ్ర'

వైసీపీ హయాంలో వస్తు సామగ్రి కొనుగోలులో భారీ అవినీతి

- లబ్ధిదారులకు భారమైన ఫ్రాంచైజీ, బ్రాండింగ్
- వినియోగదారుల నుంచి కరువైన ఆదరణ
- లక్షల్లో నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత



అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికే 'ఫిష్ ఆంధ్ర' అంటూ డప్పు కొట్టిన వైసీపీ ప్రభుత్వం... ఆచరణలో భారీ అవినీతికి తెరతీసింది. వైసీపీ పార్టీ రంగులతో, ప్రచార ఆర్భాటంతో ఆరంభమైన 2,300 యూనిట్లలో చాలా వరకూ మూతపడ్డాయి. లబ్ధిదారులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రూ.లక్షల్లో నష్టపోయారు. టీడీపీ ప్రభుత్వం దీనిపై దృష్టిపెడితే అవినీతి చేపలు దొరికే అవకాశం ఉంది. లబ్ధిదారులకు నగదు రాయితీ ఇచ్చి, నిర్దేశిత ప్రమాణాలతో రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పాల్సిన మత్స్య శాఖ... ఫ్రాంచైజీ రుసుము చెల్లించాలని, పరికరాలను తాము చెప్పిన సంస్థ నుంచే తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడే అవినీతి, అవకతవకలకు ఆస్కారం ఏర్పడింది. 'ఫిష్ ఆంధ్ర కాస్తా... 'స్కామ్ ఆంధ్ర'గా మారింది. వస్తు సామాగ్రిని తమకు అనుకూలమైన సంస్థల నుంచి కొనుగోలు చేయించి, నిధుల గోల్‌మాల్‌కు తెరదీశారు. బ్యాంకు రుణం, కేంద్రం, లబ్ధిదారుని వాటా నిధులతో వస్తు సామాగ్రి కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన తనవంతు వాటాను విడుదల చేయలేదు. లైవ్ ఫిష్ టబ్, బల్లలు, చేపలు శుద్ధి చేసే పనిముట్లు, శీతలీకరణకు రిఫ్రిజిరేటర్, ఐస్ తయారీ యంత్రం తదితర వస్తువులు... నాణ్యత ఏ మాత్రం లేని వాటిని ఎక్కువ ధరకు కొనుగోలు చేయించారు. లోగుట్టుగా అవినీతికి పాల్పడిన వైసీపీ నేతలు, అధికారులు... ప్రచారాన్ని మాత్రం ఊదరకొట్టారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20,000 మందికి ఉపాధి లభించిందని వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. ఫ్రాంచైజీ పేరుతో ఆరంభంలో రూ.80 వేలు వసూలు చేసిన మత్స్య శాఖ... ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్ కోసం ప్రతి నెలా రూ.7,000 చెల్లించాలన్న నిబంధన పెట్టింది. ప్రారంభించిన కొద్ది నెలలకే కొనుగోలు చేసిన వస్తు సామాగ్రిలో చాలా వరకూ మూలకు చేరింది. నిర్వహణ భారమయింది. లైవ్ ఫిష్ వ్యాపారానికి ఆదరణ లభించలేదు. దీంతో ఫిష్ ఆంధ్ర అటకెక్కింది. మళ్లీ 20 వేల మంది రోడ్డుపైకి వచ్చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పథకం తీరుతెన్నులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అనేక అవకతవకలు బయటపడతాయి.

బడితో చెడుగుడు!

నాడు-నేడుపై జగన్ సర్కారు చెప్పినవన్నీ అబద్ధాలే

- ప్రచారం కోసం పథకాన్ని వాడుకున్న వైసీపీ పెద్దలు
- చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే నిలిపేసిన వైనం
- మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టని నేతలు
- జగన్ ప్రభుత్వంలో మూడు వేల కోట్లు పక్కదారి
- ఇప్పుడు వాటినేం చేయాలంటూ అధికారుల కసరత్తు
- పథకం పేరు 'మన బడి-మన భవిష్యత్తు'గా మార్పు
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నాడు-నేడు' పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేస్తామని గత జగన్ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అయితే ఇందులో ప్రచారం తప్ప పనులేం చేయలేదని తేలింది. చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే వదిలేసినట్లు వెల్లడైంది. ప్రభుత్వ బడుల్లో అద్భుతాలు అంటూ రాజకీయ లబ్ధి కోసం విశ్వప్రయత్నాలు చేసిన వైసీపీ పెద్దలు... వాటిలో మౌలిక సదుపాయాల పురోగతిపై దృష్టి పెట్టలేదు. దీంతో నాడు-నేడు మధ్యలోనే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచనా వేయగా నాడు-నేడు రెండో దశలో కేవలం 7.88శాతం పనులే పూర్తిచేసిన విషయం బయటపడింది. 22,311 బడుల్లో రెండోదశ పథకం ప్రారంభించగా కేవలం 1,759 బడుల్లో మాత్రం పనులు పూర్తయ్యాయి. 20,552 పాఠశాలల్లో మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పుడు వాటినెలా పూర్తిచేయాలన్న దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. తొలుత కాంట్రాక్టు విధానంలో పనులు చేయించాలని యోచించినా, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని నిర్ణయానికొచ్చింది. కొత్తగా ఎన్నుకున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు పూర్తి చేయాలని భావిస్తోంది. పనులు ఏ దశల్లో ఉన్నాయి? ఇంకా ఏ మేరకు నిధులు అవసరం? అనేదానిపై పాఠశాల విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా 'నాడు-నేడు' పథకం పేరును 'మన బడి-మన భవిష్యత్తు'గా ప్రభుత్వం మార్చింది.

పనుల ప్రారంభంపైనా ఆరా

పనులు మధ్యలో వదిలేయడం ఒకెత్తు అయితే అసలు ఏ ప్రాతిపదికన బడుల్లో పనులు మొదలుపెట్టారనే అంశంపై కూడా పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. నాడు- నేడు పథకం ప్రారంభం నాటి అధికారులతో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఆ బాధ్యతల నుంచి తప్పుకొని వెళ్లిపోయిన వారిని కూడా పిలిపించారు. మొదటి, రెండో దశల్లో పనులు ప్రారంభానికి బడులను ఏ ప్రాతిపదికపై ఎంపిక చేశారో తెలుసుకుంటున్నారు. నాడు-నేడు పేరుతో భారీగా నిధులు ఖర్చు చేశాక కొన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. తరగతుల విలీనం ప్రక్రియ చేపట్టడంతో కొన్ని బడుల్లో విద్యార్థుల సంఖ్య జీరోకు చేరింది. దీంతో అక్కడి టీచర్లను ఇతర పాఠశాలలకు పంపి, ఆ బడులకు తాళాలు వేశారు. అయితే విద్యార్థుల సంఖ్య అంతంతమాత్రంగా ఉన్న బడులను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో ఇప్పుడు వివరాలు సేకరిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలపై దృష్టి

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మెరుగ్గానే ఉన్నా ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఏటా దిగజారుతోంది. విద్యార్థులు లేక ఆ బడులు వెలవెలబోతున్నాయి. 20 మంది విద్యార్థులు కూడా లేని బడులు దాదాపు దాదాపు 12వేల వరకూ ఉన్నాయి. వీటిలో కేవలం ఒక్కరే టీచరు ఉన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ బడుల్లోనూ ఒక్కో తరగతికి ఒక టీచర్‌ను నియమించే ఆలోచన చేస్తోంది. దాంతోపాటు అన్ని బడుల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని, వచ్చే ఏడాది నాటికి టీచర్లను పెంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నించాలని ప్రణాళికలు రూపొందిస్తోంది.



ఎక్కడి పనులు అక్కడే

45వేల ప్రభుత్వ బడుల్లో మొత్తం మూడు దశల్లో మౌలిక సదుపాయాల కల్పన పూర్తిచేస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశలో 15,715 బడుల్లో పథకం ప్రారంభించగా, దాదాపుగా పూర్తయ్యాయి. రెండోదశ పనులు 2022లో ప్రారంభించారు. 22,311 బడుల్లో వసతులు అభివృద్ధి చేయడంతో పాటు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. రూ.8వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ పనులకు ఇప్పటి వరకూ రూ.4,107 కోట్లు ఖర్చు చేశారు. అయితే రూ.7వేల కోట్లకు పైగా నిధులను వివిధ రూపాల్లో సమీకరించినా వాటిని పథకానికి వినియోగించకుండా పక్కదారి పట్టించారు. నిధుల లేమితో వేల సంఖ్యలో బడుల్లో పనులు మధ్యలో నిలిచిపోయి ప్రాంగణాలన్నీ అస్తవ్యస్తంగా మారాయి. దీనిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, కడప, విజయనగరం, మన్యం మినహా ఏ జిల్లాలోనూ పది శాతం పనులు కూడా పూర్తికాలేదు.

156 ఔషధాలపై కేంద్రం నిషేధం!

- జాబితాను విడుదల చేసిన ఔషధ నియంత్రణ శాఖ

గుంటూరు(మెడికల్), ఆగస్టు 25: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 156 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) మందులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. తక్షణం వీటి తయారీ, పంపిణీ, విక్రయాలు నిలిపివేయాలని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. నిషేధించిన మందుల్లో పలు యాంటీ బయోటిక్, యాంటీ అలర్జీ, అధిక రక్తపోటు, నొప్పి నివారణ మందులు, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు తదితరాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన డ్రగ్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) సూచనల మేరకు ఈ మందులపై కేంద్ర ఆరోగ్య శాఖ నిషేధం విధించింది. ఈ మేరకు ఈనెల 12వ తేదీన గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించింది. నిషేధ మందుల జాబితాను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. తాజాగా గుంటూరు జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఆ నిషేధిత మందుల జాబితాను విడుదల చేశారు. వీటిని తక్షణం దుకాణాల నుంచి తొలగించాలని ఆదేశిస్తూ జిల్లాలోని హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణాదారులకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ మందుల కాంబినేషన్‌లో హేతుబద్ధత లేదని, పైగా రోగుల చికిత్సల్లో ఈ మందుల వినియోగం వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని డీటీఏబీ నిపుణులు పేర్కొన్నారు. బాగా ప్రాచుర్యంలో ఉన్న పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు నిషేధిత మందుల జాబితాలో ఉండటం విశేషం. మెఫనమిక్ యాసిడ్, పారా సిటమాల్ కాంబినేషన్ ఇంజెక్షన్లను సాధారణంగా నొప్పి నివారణకు వినియోగిస్తారు. ఈ కాంబినేషన్ మందు వల్ల రోగుల్లో తీవ్రమైన దుష్ఫలితాలు తలెత్తుతున్నట్లు నిపుణులు గుర్తించారు. అదే విధంగా ఎసిక్లోఫెనాక్, పారాసిటమాల్ కాంబినేషన్ చాలా సాధారణంగా వైద్యులు ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. ఈ కాంబినేషన్‌పైనా ప్రభుత్వం నిషేధం విధించింది. మొటిమల చికిత్స, ముక్కు దిబ్బడ, చర్మవ్యాధుల చికిత్సల్లో వాడే ఔషధాలు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. గతంలో 2018లో కేంద్ర ప్రభుత్వం 328 ఎఫ్‌డీసీ మందులపై నిషేధం విధించింది. ఆరేళ్ల తర్వాత మరోసారి పెద్ద సంఖ్యలో మందులపై నిషేధం విధిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

1 నుంచి బీజేపీ సభ్యత్వం: పురందేశ్వరి



సర్పవరం జంక్షన్ (కాకినాడ), ఆగస్టు 25: 'పదకొండవ ఆర్థిక శక్తిగా ఉన్నటువంటి భారతదేశాన్ని ప్రధాని మోదీ పాలనలో ఐదో ఆర్థిక శక్తిగా అవతరించి ప్రపంచ పటంలో ఆవిష్కరించింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మూడో ఆర్థికశక్తిగా చూడాలనే దిశగా బీజేపీ కూటమి ప్రయత్నిస్తోంది' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఆమె కాకినాడలో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించే పార్టీ సభ్యత్వ నమోదుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 37 లక్షల మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె తెలిపారు. కాగా, త్వరలో జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి తమ మేనిఫెస్టోలో ఆర్టికల్ 370, 35ఏలను పునరుద్ధరిస్తామని ప్రకటించడాన్ని బట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే రీతిలో వ్యవహరిస్తారని మండిపడ్డారు. దీనిపై రాహుల్ గాంధీ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ: భువనేశ్వరి



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా పేద అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ శిక్షణ ఉంటుందని, అర్హులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు.

గంజాయి ముఠా అరెస్టు

రేపల్లె, ఆగస్టు 25: ఐదుగురు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు పట్టణ సీఐ ఎ.మల్లికార్జున్‌రావు తెలిపారు. ఆదివారం రేపల్లె మండలంలోని బేతపూడి, పల్లెకూన వెళ్లే రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే సచివాలయం వద్ద కొంతమంది గంజాయి విక్రయిస్తుండగా జిల్లా ఎస్పీ తుషార్‌దూడి, డీఎస్పీ మల్లికార్జున్‌రావు ఆదేశాలతో గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయి, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. భట్టిప్రోలు మండలం పల్లెకూన గ్రామానికి చెందిన ఆళ్ళమూడి సుదర్శన్, పులివర్తి రాధాకృష్ణ, కనపర్తి సువర్ణరాజు, పులివర్తి సుమంత్, సయ్యద్ గోపి, విచారపు నాగరాజును అరెస్టు చేసినట్లు తెలిపారు. కె.భానుప్రసాద్ పరారీలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 25: పట్టణంలోని గుంటూరు రోడ్డులోని స్వర్గపురి వద్ద శనివారం రాత్రి సుమారు 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ గుంటూరు రోడ్డులోని స్వర్గపురి వద్ద కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎపీ స్పెషల్ పోలీస్ సిబ్బంది, రెండో పట్టణ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు ఈ దాడుల్లో బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన గుంజి సుబ్బారావు, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కొమ్మలపాడు గ్రామానికి చెందిన సుల్తాన్ బి, గుంటూరు జిల్లా వినుకొండ 'ప చెందిన షైలపోగు వెంకటేశ్వరిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి పది కేజీల గంజాయి, రూ. 62,000 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు.

వరవకట్టను జల్లెడ పట్టిన పోలీసులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 25: స్వల్ప వ్యవధిలోనే పట్టణంలోని మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరవకట్టలో రెండోసారి ఆదివారం తెల్లవారు జామున పోలీసులు జల్లెడ పట్టారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ కే. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, పదిమంది ఎస్సైలు, 100 మంది సిబ్బందితో వరవ కట్టను దిగ్బంధించి తనిఖీలు నిర్వహించారు ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 46 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు ఆధార్ కార్డు లేకుండా నివసిస్తున్న బీహార్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన 18 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఓ రౌడీ షీటర్‌ను మరో అనుమానిత షీటర్ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావు తెలిపారు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి 7 గంటల మధ్య ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మారణాయుధాలు, కర్రలు బాణాసంచా కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు సరైన అనుమతి పత్రాలు సమర్పించి వాహనాలను సంబంధిత యజమానులు తీసుకెళ్లవచ్చని, లేనిపక్షంలో వాటిని న్యాయస్థానంలో ప్రవేశపెడతామ న్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న పలువురు వరవకట్ట లో షెల్టర్ తీసుకుంటున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

ఎన్టీఆర్ బస్టాండ్‌లో అనధికారిక విక్రయాలు

- నిబంధనలను ఉల్లంఘిస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

గుంటూరు, ఆగస్టు 25: ఎన్టీఆర్ బస్టాండ్‌లో అనధికారిక విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. వ్యాపారులతో కొందరి సిబ్బంది లాలూచీ పడటంతో ఈ తతంగం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్టాండ్‌లో పర్యవేక్షించాల్సిన అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) కె.సత్యనారాయణ మంగళగిరి డిపోకు ఇన్చార్జిగా వ్యవహ రిస్తుండటంతో ఇక్కడ పాలన మరింత గాడి తప్పిందన్న విమర్శలు వస్తున్నాయి. కొందరు వ్యాపారులు పోటీ పడి మరీ టెండర్లు దక్కించుకొని దుకాణాల్లో వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక పలువురు ప్రయాణికుల నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ అవి బుట్టదాఖలు అవుతున్నాయి.



బస్టాండ్ ఆవరణలో అడ్డగోలుగా నిలిపిన వాహనాలు



బస్టాండ్‌లో ఎటు చూసినా వాహనాలే..

ఎన్టీఆర్ బస్టాండ్ ఆవరణలో ఎటుచూసినా అనధికార వాహనాల పార్కింగ్ కనిపిస్తుంది. వాస్తవానికి బస్టాండ్ ఆవరణ లోపల వాహనాల రాకపోకలకు నిషేధం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

చిల్లర పేరుతో నిలువు దోపిడీ

బస్టాండ్‌లో ఉన్న కొన్ని దుకాణాల వారు చిల్లర పేరుతో ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇటీవల ఓ స్టాల్‌లో ప్రయాణికుడు వ్యాపారికి రూ. 500 ఇచ్చాడు. వ్యాపారి రూ.50 తీసుకోవాల్సి ఉండగా, చిల్లర లేదని రూ. 150 తీసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు విషయం పోలీసుల దాకా వెళ్లినట్లు సమాచారం. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయాలు జరుపుతున్నారు. ధరల పట్టికలు, ఫిర్యాదు చేయాల్సిన అధికారుల ఫోన్ నంబర్ల వంటి బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌లోనూ ఇలానే చిల్లర ఇచ్చే క్రమంలో వినియోగదారుడిని మోసం చేయటంతో విషయం అధికారుల వద్దకు చేరింది. మరో వైపు బస్టాండ్ ప్రాంగణంలోని మరుగుదొడ్ల నిర్వహణ కూడా అధ్వానంగా ఉంది. ప్లాట్‌ఫామ్‌లోని మరుగుదొడ్లలో మహిళల నుంచి కూడా రూ.10 వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పశ్చిమ డెల్టా కాల్వకు 7508 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 25: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 7508 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారు దలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండ గా, దిగువకు 18,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 330 క్యూసెక్కులనీరు, రేపల్లెకాల్వకు 1889, తూర్పుకాల్వకు 690, పశ్చిమకాల్వకు 230, నిజాంపట్నంకాల్వకు 460, కొమ్మమూరుకాల్వకు 3260 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అనువాద కొండ.. బెల్లంకొండ



సదస్సులో ప్రసంగిస్తున్న రచయిత, పాత్రికేయులు రెంటాల జయదేవ్, ప్రముఖులు.

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 25: తెలుగు అనువాద సాహిత్యంలో బెల్లంకొండ అనువాద కొండగా నయగార కవులలో ఒకరైన బెల్లంకొండ రామదాసును ప్రముఖ రచయిత, పాత్రికేయులు రెంటాల జయదేవ్ అభివర్ణించారు. ఆదివారం పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో కేంద్ర సాహిత్య అకాడమి, పల్నాడు కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో జరిగిన బెల్లంకొండ రామదాసు శత జయంతి సదస్సులో పాల్గొన్న ఆయన బెల్లంకొండ అనువాద సాహిత్యంపై పత్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయన బెల్లంకొండ తన తండ్రి రెంటాల గోపాల కృష్ణతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఇద్దరూ కలిసి అనువదించిన రష్యన్ క్లాసిక్ యుద్ధం శాంతి నవలను విశ్లేషించారు. బెల్లంకొండ సాహిత్యంలో చేయని ప్రక్రియ లేదన్నారు. సదస్సులో స్వాగతోపన్యాసం చేసిన కేంద్ర సాహిత్య అకాడమి తెలుగు సలహా సంఘం కన్వీనర్ సి. మృణాళిని మాట్లాడుతూ బెల్లంకొండ పుట్టిన ఊరులోనే ఆయన శత జయంతి నిర్వహించడం ముదావహమన్నారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ నయగార కవిగా బెల్లంకొండ అనే అంశం గురించి మాట్లాడారు. నాటక రచయిత కందిమళ్ల సాంబశివరావు బెల్లంకొండ నాటకాలను విశ్లేషించారు. రచయిత మన్నే శ్రీనివాసరావు బెల్లంకొండ నాటికలను, జడ సుబ్బారావు బెల్లంకొండ కథలను విశ్లేషించి, పత్రాలు సమర్పించారు. రచయిత, పాత్రికేయులు సయ్యద్ నశీర్ అహ్మద్ బెల్లంకొండ కుటుంబ నేపథ్యాన్ని వివరించారు. సదస్సును తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రచయితలు సుజాత వేల్పూరి, అనిల్ బత్తుల, చేపూరి వెంకట్రావ్, కట్టా సిద్దార్ గంధం యాజ్ఞవల్క్యశర్మ, యన్నం నర్సిరెడ్డి, కేవీకే రామారావు లను నిర్వాహకులు సన్మానించారు. కళాక్షేత్రం కార్యదర్శి యస్.యం.బాషా సదస్సును నిర్వహించారు. కళాక్షేత్రం వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి పర్యవేక్షించారు. సదస్సు ఎండీ సర్దార్ పాషా, షేక్ బాజీ మస్తాన్, బాజాన్, మూర్తి, అమీర్ భాషా, ఎస్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మొదటి విద్యాధికారి శ్రీనాథుడే

ఏయూ ఆచార్య డాక్టర్ బూసి వెంకట స్వామి

ఫిరంగిపురం, ఆగస్టు 25: దేశంలో మొట్టమొదటి విద్యాధికారి కవి సార్వభౌముడిగా వెలుగొందిన శ్రీనాథుడేనని ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్య డాక్టర్ బూసి వెంకట స్వామి అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో కొండవీడు రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఉభయ రాష్ట్రాల శతాధికార కవి సమ్మేళనం సభలో ఆయన మాట్లాడారు. సామాజిక చైతన్యం కోసమే కొండవీటి రచయితల సంఘం ఏర్పడటం ముదావాహం అన్నారు. మొదటిగా గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు, శ్రీనివాస అయ్యర్‌లు భాషోద్యమాన్ని ఉప్పెనగా చేశారన్నారు. అనంతరం కృష్ణ శాస్త్రీ భావ కవిత్వాన్ని అందించారని తెలిపారు. అనంతరం అభ్యుదయ కవిత్వాన్ని కందుకూరి, రాయప్రోలు, గురజాడ, శ్రీశ్రీలు అందించారన్నారు. అనంతరం వచన, దిగంబర, దళిత కవిత్వం, బహుజన వాద కవిత్వం, హైస్కూల్ ఇలాంటి అనేక రకాల కవిత్వాలు తామర తంపరగా వచ్చాయన్నారు. 30 మంది వరకు పాల్గొన్న కవులు, రచయితలు, గాయకులు వచన కవిత్వం ద్వారా తెలుగు భాషను అద్వితీయంగా తెలిపారు. విశ్వ భాషలలో మేటి భాష తెలుగు భాష అని, ఆంధ్రా వైభవాన్ని అవనిలో చాటిన భాషా తెలుగు అని చెప్పారు. తెలుగు



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఏయూ ఆచార్య డాక్టర్ బూసి వెంకట స్వామి

మనుగడ ప్రశ్నార్థకం కాకుండా చేయాలని తెలుగు తల్లి ఆర్థిస్తుందని, కవులు, రచయితలు తమ వచనాలు, గేయాలు, కవితల ద్వారా తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహమ్మద్ రఫీ రచించి బాణీ కట్టిన పాటల క్యాసెట్‌ను విడుదల చేశారు. అలాగే చౌపాటి ప్రభాకర్ రచించిన పుస్తకాలను ఈఏ ఆచార్య జేసీ వెంకటస్వామి ఆవిష్కరించారు. కార్యదర్శి తోళ్ళమడుగు గోవిందయ్య, పరవస్తు చిన్నయ్య సూరి, వై.సుందర్, కవులు, రచయితలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు అధికారాలు ఇవ్వాలి

గుంటూరు (కార్పొరేషన్), ఆగస్టు 25: రాజ్యాంగంలో ఆర్టికల్ 243 పేర్కొనట్లుగా స్వయం పాలక ప్రభుత్వాలుగా స్థానిక సంస్థలకు అధికారాలివ్వాలని మాజీ రాజ్యసభ సభ్యులు, ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ ఛైర్మన్ డాక్టర్ యస్.తులసీరెడ్డి సూచించారు. గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలకు విధులు, నిధులు, అధికారాలను బదిలీ చేస్తేనే బలోపేతం అవుతాయని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమౌతుందని వివరించారు. గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో స్థానిక ప్రభుత్వాల సాధికారతపై జరిగిన చర్చాగోష్ఠికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యన్. తులసీ రెడ్డి ప్రసంగిస్తూ గత రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను దారి మళ్లించి వాటిని నిర్వీర్యం చేయడం దురదృష్టకరమన్నారు. వాలంటరీ, సచివాలయ వ్యవస్థలను పంచాయతీలకు సమాంతర వ్యవస్థలుగా మార్చి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మిగిల్చినారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందకుండా దేశాభివృద్ధిని ఆశించలేమన్నారు. శాసన మండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించకుండా రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి ఎలాంటి నిధులను స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వలేదన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ కార్యాచరణ ద్వారా స్థానిక ప్రభుత్వాలు వికసిస్తాయన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే చేతుల్లో అధికారం కేంద్రీకృతం అవడం వలన అధికార, పాలన వికేంద్రీకరణకు ఆస్కారం లభించడం లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాల నిధులు, విధులు, అధికారాల పై విస్తృతంగా చర్చలు జరగాలని, ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు



మాట్లాడుతున్న ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.తులసీ రెడ్డి

మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామసభలు విజయవంతంగా జరిగాయని, కేంద్ర ఆర్థిక నిధులు విడుదలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షులు పోతుల బాలకోటయ్య, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పి శేషుబాబు, నేస్తం సహా వ్యవస్థాపకులు ధనుంజయ రెడ్డి ప్రసంగించారు.

ఏకగ్రీవంగా చేసిన తీర్మానాలు..

73వ రాజ్యాంగ సవరణలో గ్రామీణ ప్రాంతాల్లో పేర్కొన్న 29 అంశాలను, 74వ రాజ్యాంగ సవరణలో పట్టణ ప్రాంతాలకు పేర్కొన్న 18 అంశాలను దశల వారీగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు కేటాయించి అమలు చేయాలి. గ్రీన్ అంబాసిడర్ల జీతాలు 6000 నుంచి 10,000 పెంచి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. 5 వ రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను వెంటనే స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలి. 15వ కేంద్ర ఆర్థిక సంఘం నిధులను ఇచ్చిన వెంటనే స్థానిక ప్రభుత్వాలకు ఎలాంటి జాప్యం లేకుండా బదిలీ చేయాలి. రాజకీయాలకు అతీతంగా సర్పంచులందర్నీ ఒకే విధంగా చూడాలి. ఉపాధి హామీ పథకాన్ని ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా అమలు చేయాలన్న తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

శత జయంతి ఉత్సవాల నిర్వహణకు ప్రాధాన్యం



సి.మృణాళిని

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 25: కవుల, రచయితల శత జయంతి ఉత్సవాల నిర్వహణకు సాహిత్య అకాడమీ ప్రాధాన్యమిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం కన్వీనర్ సి.మృణాళిని చెప్పారు. ఆదివారం స్థానిక భువన చంద్ర టౌన్ హాల్‌లో జరిగిన బెల్లంకొండ రామదాసు శత జయంతి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె సాహిత్య అకాడమీ చేపట్టే పలు సాహిత్య కార్యక్రమాల గురించి ఆంధ్రజ్యోతికి వివరించారు. తొలితరం రచయితలు, కవులు, వారి సాహిత్యం ఈ తరానికి తెలియజెప్పాలనే ఉద్దేశంతో జయంతి సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నగరాల్లో కాకుండా ఆ రచయితలు పుట్టిన ఊర్లలోనే నిర్వహించాలని భావిస్తున్నట్లు చెప్పారు. బెల్లంకొండ రామదాసు పుట్టిన ఊరైన నరసరావుపేటలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అకాడమీ తరపున కవిసంధి, విమర్శకుడితో ఒక సాయంత్రం, మీట్ ద రైటర్ వంటి సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం తెలంగాణలో రెండు, ఆంధ్రాలో రెండు కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే నిజామాబాద్‌లో సాహిత్యంలో పర్యావరణంపై సదస్సు, సాహిత్యంలో ప్రపంచీకరణ అంశంపై బెనారస్‌లో సదస్సు చేసినట్లు చెప్పారు. ప్రచురణల విషయంలో జీవిత చరిత్రలకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఆమె తెలిపారు. దేశవ్యాప్తంగా ఢిల్లీలో ఆరు రోజులు సదస్సు జరుగుతుందని, తెలుగు రాష్ట్రాల నుంచి రచయితలకు ఆహ్వానం ఉంటుందని పేర్కొన్నారు. గొప్ప సాహిత్యకారుల జీవితాలపై డాక్యుమెంటరీ తీసే ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు. అకాడమీ తరపున నిర్వహించే ప్రతి సదస్సును పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు.

1.0634 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 25: నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శనివారం అర్ధరాత్రి వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0634 ఎంయూల విద్యుత్ తయారైందని ఎస్ఈ కె.వెంకట రమణ చెప్పారు. ప్రాజెక్టు 3 క్రస్ట్ గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 21,258, టేల్ రేస్ ఛానల్ ద్వారా 8,608 మొత్తంగా 29,866 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 29 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.46 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.053 టీఎంసీకి సమానమన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 25: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 589.50 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,076 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,867 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 48,710 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 48,710 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 25: పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 48,541 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 57,952 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు. పవర్ జనరేషన్ ద్వారా 16 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందని తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలు



క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న సీఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య

చిలకలూరిపేట, ఆగస్టు 25: ఆంధ్రరాష్ట్ర క్యారమ్ సంఘ పర్యవేక్షణలో పల్నాడు జిల్లా క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ క్లబ్‌లో రెండు రోజులు పాటు జరిగిన రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య, రాష్ట్ర క్యారమ్స్ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. శ్రీగిరిరాజు కృష్ణమూర్తి జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు రూ.25 వేలు క్రీడాకారులకు అందజేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. పురుషుల జట్టులో ప్రథమ స్థానం సీహెచ్ జనార్ధన్ రెడ్డి(విశాఖపట్నం), ద్వితీయ స్థానం బి.రవీంద్ర రెడ్డి (గుంటూరు), తృతీయ స్థానం జి.జయకుమార్ (గుంటూరు), నాలుగో స్థానం కె.ఉమామహేశ్వర రావు(ఎన్టీఆర్), 5వ స్థానం బి.పవన్ కుమార్(అనంతపూర్), 6వస్థానం టి.మల్లికార్జున (గుంటూరు). మహిళల విభాగంలో ప్రథమ స్థానం ఎంఎస్‌కే హారిక (విశాఖపట్నం), ద్వితీయ స్థానం ఎల్ హరిప్రియ (విశాఖపట్నం), తృతీయ స్థానం ఎన్.రాజ్యలక్ష్మి(గుంటూరు), 4వ స్థానం ఎస్‌కే హుస్నాసమీరా (విశాఖపట్నం) నిలిచారు. కార్యక్రమంలో జిల్లా క్యారమ్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చల్లగుంట్ల అజయ్ బాబు, బోయపాటి రవితేజ, రాష్ట్ర సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుర్రా శ్రీనివాసరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌వీ రమణ మూర్తి, టోర్నమెంట్ కన్వీనర్ శర్మ, చీఫ్ రిఫరీ డీఎస్ఆర్ మూర్తి, అసిస్టెంట్ చీఫ్ రిఫరీ సిరాజ్ బాష పాల్గొన్నారు.

వెటరన్ టీ-20 క్రికెట్ విజేత గుంటూరు



ఛాంపియన్‌గా నిలిచిన గుంటూరు జట్టు

నెల్లూరు (విద్య), ఆగస్టు 25: నెల్లూరులోని సీఏఏ క్రికెట్ మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వెటరన్ టీ-20 క్రికెట్ పోటీల్లో గుంటూరు జట్టు చాంపియన్‌గా నిలిచింది. సీనియర్ క్రీడాకారుడు తాటిపర్తి సునీల్‌కుమార్ స్మృత్యర్థం వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు, నెల్లూరు జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 165 పరుగులు సాధించింది. ఎం.రాజాకృష్ణ 98 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసి విజేతగా నిలిచింది. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు పి.భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

చిలకలూరిపేట, ఆగస్టు 25: రోడ్డు ప్రమాదంలో బాలిక ఆదివారం దుర్మరణం చెందింది. ఈ మార్గంలో మద్దిరాల - పోతవరం గ్రామాల మధ్య తొలుత రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఒక ద్విచక్ర వాహనంపై తండ్రితో కలిసి ప్రయాణం చేస్తున్న బాలికను మృత్యువు వెంటాడింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనం పక్కనే వెళుతున్న గ్రానైట్ లోడు లారీ కింద బాలిక పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన బాలిక మద్దిరాల గ్రామానికి చెందిన హసిఫా (15)గా పోలీసులు గుర్తించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

గ్రామసభల్లో 420 ఉపాధి పనుల గుర్తింపు

రొంపిచర్ల, ఆగస్టు 25 : మండలంలోని గ్రామాల్లో ఈనెల 23వ తేదీన గ్రామ సభలు జరిగాయి. గ్రామసభల్లో 420 ఉపాధి పనులు గుర్తించినట్టు ఏపీవో ప్రసాదు ఆదివారం తెలిపారు. వీటికి నివేదికలు తయారు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. గతంలో 24 పంచాయతీలకు 28 పనులకు గాను రూ.2.77 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సిమెంట్ రోడ్లు, డ్రెయిన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. అలవాల, చాకలికుంట, నల్లగార్లపాడు, బుచ్చిబాపన్నపాలెం మినహాయించి 24గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్‌లు నిర్మించనున్నట్టు తెలిపారు.

పిట్టంబండ గ్రామంలో పోలీస్ పికెట్



పిట్టంబండ గ్రామంలో శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న పోలీసులు

వినుకొండటౌన్, ఆగస్టు 25: మండలంలోని పిట్టంబండ గ్రామంలో పట్టణ సీఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామంలో వైసీపీ, టీడీపీ యువకుల మధ్య నాగులవరం గ్రామ సమీపంలోని దాబా వద్ద జరిగిన ఘర్షణలో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడడంతో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు శాంతి భద్రతలు దృష్ట్యా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో పర్యటించి ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మధుసూదనరావు కుటుంబానికి ఎంపీ పరామర్శ



మధుసూదనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

రొంపిచర్ల, ఆగస్టు 25: మండలంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన మందలపు మధుసూదనరావు ఇటీవల మృతి చెందారు. కాగా అతని కుటుంబసభ్యులను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నల్లపాటి రాము, కాకుమాను పెద పేరిరెడ్డి, సయ్యద్ జిలానీ, పొనుగోటి రామారావు, వడ్లమూడి వెంకటకిషోర్, గరికపాటి తాతయ్య, పేరుపోగు దాసు, తాడపనేని రామప్రసాదు తదితరులున్నారు.

రషీద్ హత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి

వినుకొండటౌన్, ఆగస్టు 25: పట్టణంలో సంచలనం సృష్టించిన రషీద్ హత్య కేసులో న్యాయం చేయాలంటూ రషీద్ కుటుంబసభ్యులు పట్టణ సీఐ శోభన్ బాబును ఆదివారం కలిసి వినతిపత్రం అందచేశారు. హత్య కేసులో టీడీపీ నాయకులు ఉన్నారని, కేసు నుంచి వారిని తప్పించే ప్రయత్నం చేస్తున్నారని, ఇప్పటికైనా గతంలో కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు కోరారు. లేనిపక్షంలో మరెన్నో దారుణాలు జరిగే ప్రమాదం ఉందని సీఐకి తెలిపారు.

లారీని ఢీకొన్న ఆటో.. ఒకరు మృతి

రొంపిచర్ల, ఆగస్టు 25: మండలంలోని అన్నవరప్పాడు గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని ఆటో ఆదివారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోగులపాడు గ్రామానికి చెందిన షేక్ జానీ బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంతమాగులూరు మండలం అన్నవరప్పాడు వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది.

డివైడర్‌ను ఢీకొన్న కారు

వినుకొండటౌన్, ఆగస్టు 25: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన పట్టణంలోని కరెంటు ఆఫీసు వద్ద ఆదివారం జరిగింది. కారంపూడి నుంచి వినుకొండ పట్టణంలోకి ప్రవేశిస్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణికులకు ఎటువంటి గాయాలవకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. డివైడర్ ముగింపు ప్రాంతం లో ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారుల డివైడర్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రమాదాలు నివారణ చర్యలు తీసుకోవాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తండాల్లో మౌలిక వసతులు కల్పించాలి

● బంజారా సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు బాబూనాయక్

వినుకొండ, ఆగస్టు 25: నియోజకవర్గంలో మౌలిక వసతులు లేని తండాలకు ప్రభుత్వం వెంటనే మౌలిక వసతులు కల్పించాలని బంజారా సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు అమ్మ బాబూనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో అనేక తండాలు ఉన్నాయని, కనీసం రోడ్డు సౌకర్యంతో పాటు, తాగునీటి వసతిలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తండా ప్రజలు సమస్యలు వినిపించేందుకు చట్టసభల్లో కనీసం ఎమ్మెల్యే, ఎంపీలు కూడా లేరన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణం చర్యలు తీసుకొని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు, పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు, పుస్తకాలను పంపిణీ చేసిన చిత్రం

చిలకలూరిపేట, ఆగస్టు 25: విద్యార్థులు దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని స్థానిక ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని ఆదివారం కోరారు. పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో 45 మంది విద్యార్థులకు దుప్పట్లు, పెన్నులు, పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ చిలుకూరి సుబ్బాయమ్మ అందించిన ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి నార్నె జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

● బస్సు క్లీనర్ మృతి

నల్గొండ, ఆగస్టు 25: డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో బస్సులోని క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం తెల్లవారుజామున నల్గొండ జిల్లా వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో గల నార్కట్‌పల్లి - అద్దంకి రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెలింగ్ బస్సు రాత్రి 8 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల నుంచి 27 మంది ప్రయాణికులు, డ్రైవర్ కేసాని మురళీకృష్ణ, క్లీనర్ దావాల దావీద్ (40)లతో బస్సు హైదరాబాద్‌కు బయలుదేరింది. రాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో మండలంలోని శెట్టిపాలెం గ్రామశివారులోని మహర్షి మిల్లు సమీపంలో రోడ్డు పక్కన నిలిచి ఉన్న డీసీఎం వ్యాన్‌ను అతి వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం, బస్సు మధ్యలో ఇరుక్కున్న బస్సు క్లీనర్ దావీద్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. అనంత రం ప్రయాణికులను వేరొక బస్సులో తమ గమ్యస్థానాలకు పంపించారు. అనంతరం మృతదేహానికి పంచనామా నిర్వహించిన పోలీసులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఏఎస్ఐ నరసింహారావు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడు దావీద్ చిలకలూరిపేట వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటుండగా ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

టీడీపీలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఆగస్టు 25 : తెలుగుదేశం పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకురావటానికి అంకిత భావంతో పనిచేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం చంద్రబాబునాయుడు సంతకంతో ప్రశంసాపత్రాలను ప్రత్తిపాటి సంబంధిత వ్యక్తులకు అందజేశారు. మన టీడీపీ యాప్ ద్వారా పార్టీ సమాచారాన్ని షేర్ చేసి చిలకలూరిపేట నియోజకవర్గంలో అత్యున్నత స్థాయిలో నిలిచిన పదిమందిని గుర్తించి ఈ ప్రశంసాపత్రాలు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఇక్కడకు పంపారు. ఈ ప్రశంసాపత్రాలను ప్రత్తిపాటి పుల్లారావు ఇక్కడ అందజేశారు. నియోజకవర్గంలో టీడీపీని తిరుగులేని శక్తిగా ఉంచటంలో కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పని చేయాలని ఆయన కోరారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రణాళికలు ప్రజలకు చేరువ చేసేందుకు మన టీడీపీ యాప్‌ను విస్తృతంగా వినియోగించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక అన్ని వర్గాల ప్రజలకు చేరువ కావాలి

● జిల్లాస్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

చిలకలూరిపేట, ఆగస్టు 25 : జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా 18వ వార్షిక సమావేశం ఆదివారం స్థానిక సాదినేని చౌదరయ్య స్కూల్లో నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన జేవీవీ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు హాజరై మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత జనవిజ్ఞానవేదిక మరింత విస్తృత కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. జనవిజ్ఞాన వేదిక అన్ని వర్గాల ప్రజలకు చేరువగా, వారి భాగస్వామ్యంతో రోజురోజుకు అభివృద్ధి చెందాలని, ఈ ప్రక్రియలో సంఘం సభ్యులు ముఖ్యపాత్ర పోషించాలని ఆయన సూచించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేసి శాస్త్రీయ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ గత సంవత్సరం చేపట్టిన కార్యక్రమాలకన్నా ఈ ఏడాది ఎక్కువ చేయాలని జిల్లా ప్రతినిధులకు సూచించారు. సైన్స్, సమ సమాజం, నవ సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌదరయ్య స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డి, న్యాయవాది మాదాసు భానుప్రసాద్, సాహితీవేత్త డాక్టర్ పీవీ సుబ్బారావు, వ్యాపారవేత్త ధూళిపాళ్ల వెంకటరావు, ఉపాధ్యాయిని టి.కుమారి ప్రసంగించారు. పల్నాడు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇదేవేదికపై ఐఏఎస్ సివిల్ సర్వీసెస్ ప్రాథమిక అంశాలకు చెందిన కీలక విషయాలను తెలియజేసే ఎమ్మెల్సీ లక్ష్మణరావు రచించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 52వ బ్రాంచి ప్రారంభం



ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 25 : సహకార వ్యవస్థ మధ్య, పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలనే లక్ష్యంతో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకును స్థాపించారని సహకార వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే, బ్యాంకు మాజీ ఛైర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. ఆదివారం నరసరావుపేట పట్టణంలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 52వ బ్రాంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా మానం ఆంజనేయులు మాట్లాడుతూ 2025 మార్చి నాటికి బ్యాంక్ రూ.8 వేల కోట్లు లక్ష్యంగా డిపాజిట్లు సేకరణ ఉంటుందన్నారు. బ్యాంకు లక్ష్యం పరస్పర సహకారం అన్నారు. సహకార వ్యవస్థలను చంపేయాలని చూసిన ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. పాలకవర్గాల అసమర్థత వల్లే ఎక్కువ బ్యాంకులు మునిగిపోతున్నాయని, పాలకవర్గం, ఉద్యోగులు, సభ్యులు కలిసి ఉంటేనే సహకార వ్యవస్థ బలోపేతంగా ఉంటుందన్నారు. నరసరావుపేట బ్రాంచ్‌ను రక్షించుకునే బాధ్యత స్థానిక డిపాజిట్‌దారులదే అన్నారు. అత్యధిక కుటుంబాలకు రుణాలు ఇచ్చి వారిని ఆర్థికంగా నిలబెడితే బ్యాంకును సార్థకత వస్తుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ కోఆపరేటివ్ బ్యాంకులు ప్రజల విశ్వాసం మీద కొనసాగుతూ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ది గుత్తి కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ షేక్ అబ్దుల్ జిలానీ, ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్, ది సిటిజెన్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ పీఆర్‌వీపీఎస్ రంగరాజు, ఆత్మీయ అతిథులు ఏలూరు గురవయ్య, గుంటూరు మహిళా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ వాణి సుజాత, కంబమ్ కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ ఆర్‌కేఆర్ జనార్ధన్‌రావు, జిల్లా సహకార అధికారి ఎం వెంకటరమణ, డీసీఏవో శ్రీనివాసరావు, ఈడీపీ రామకృష్ణారావు, పాలవర్గం వైస్ ఛైర్మన్ ఎం రాఘవరావు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

250మందికి షుగర్, బీపీ వైద్య పరీక్షలు



వైద్యశిబిరంలో రిపోర్టులను పరిశీలించి సలహాలు ఇస్తున్న వైద్యులు

యడ్లపాడు, ఆగస్టు 25: యడ్లపాడు గ్రామాభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో షుగర్, బీపీ వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. స్థానిక పీఆర్ విజ్ఞానకేంద్రం వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ లింగమల్లు మోహన్‌బాస్కర్, జూనియర్ వైద్యులు గుంటుపల్లి భవ్యతేజ, శొంఠినేని నవ్యశ్రీలు పాల్గొని వైద్యసేవలు అందించారు. శిబిరానికి హాజరైన 250మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడ మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగమల్లు భాస్కర్ శిబిరానికి హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ షుగర్, బీపీలతో బాధపడుతున్నవారు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, వ్యాయామం తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. కాగా గోగులమూడి గ్రామానికి చెందిన రామినేని విజయ, సుబ్బారావు దంపతులు 30 మంది వలంటీర్లకు భోజన సదుపాయాన్ని, యడ్లపాడుకి చెందిన చెన్నుపాటి పూర్ణచంద్రరావు అల్పాహారాన్ని అందించారు. కార్యక్రమాలను అభివృద్ధి కమిటీ సభ్యులు ముత్తవరపు రవీంద్ర, కేతా రాంబ్రహ్మం, పోపూరి శ్రీనివాసరావు, ముత్తవరపు వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

28న మండల సర్వసభ్య సమావేశం

శావల్యాపురం, ఆగస్టు 25 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28వతేదీన ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జడ్పీటీసీ హైమావతి పాల్గొననున్నారని తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డుమెంబర్ లు, ప్రజాప్రతినిధులంతా సమావేశానికి హాజరై గ్రామాల్లో నెలకొనియున్న ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామస్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

ఆర్టీసీ డిపోలో రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలి



వినుకొండ ఆర్టీసీలో మూతబడిన రిజర్వేషన్ కౌంటర్

వినుకొండటౌన్, ఆగస్టు 25: ఆర్టీసీ బస్టాండ్‌లో వారం రోజులుగా రిజర్వేషన్ కౌంటర్ మూసివేయడంపై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుదూర ప్రాంతాలైన హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రిజర్వేషన్ కౌంటర్ తెరవకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రిజర్వేషన్ కౌంటర్ త్వరలో ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెండేళ్లుగా ఆలయంలో చీకట్లే

● విద్యుత్‌శాఖకు సిద్ధి మల్లేశ్వరస్వామి అప్పు



శివపురం సమీపంలోని సిద్ధి మల్లేశ్వరస్వామి దేవాలయం



అధికారులు ఇచ్చిన విద్యుత్ బిల్లు

వినుకొండటౌన్, ఆగస్టు 25: ఆ దేవాలయానికి 1200 ఎకరాల భూమి ఉంది. కానీ నిత్యం చీకటే. లేని మీటర్ సృష్టించి, బిల్లు చెల్లించలేదని శివాపురం సిద్ధి మల్లేశ్వరుడు దేవాలయానికి విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరా తొలగించిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని శివాపురం సమీపంలో 1672 సంవత్సరం నాటి సిద్ధి మల్లేశ్వరుడు స్వామి దేవాలయం కలదు. దేవాలయానికి సుమారు 1200 ఎకరాల భూమి ఉంది. ఆదాయం ఉన్నపటికీ దీపధూప నైవేద్యానికి నిధులు కరువైయ్యాయి. దేవదాయ శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో, ధర్మకర్త డిమాండ్ మేరకు ఆక్రమణ మినహా.. ఉన్న భూములకు కౌలు పెంచాలని అధికారులపై వత్తిడి పెరిగింది. దీంతో గ్రామంలోని కొందరు గత వైసీపీ నాయకుల అండతో, దేవాలయానికి లేని మీటర్ ఉన్నట్లు, మీటర్ నంబర్ 31420890 సృష్టించి. 2022 సంవత్సరం నవంబర్ 18 తేదీన రూ.28587 చెల్లించాలని పూజారికి, విద్యుత్‌శాఖ అధికారులు బిల్లు ఇచ్చారు. లేని మీటరు ఉన్నట్లు, సిద్ధి మల్లేశ్వరుడు బదులు, నూజండ్ల మండలం పెద్దారం (ప్రకాష్ నగర్ కాలనీ) కాలనీలోని పురాతన పార్వతీ సమేత, సిద్ధి మల్లేశ్వర స్వామి బకాయిల బిల్లును, శివాపురం సమీపంలోని సిద్ధి మల్లేశ్వరుడు దేవాలయానికి బిల్లు చెల్లించాలని నోటీసు ఇచ్చారు. బిల్లులు చెల్లించలేదని సాకుతో, నాటి నుంచి నేటికీ ఆ దేవాలయానికి విద్యుత్ సఫరాలేకపోవడంతో రాత్రులు దేవాలయంలోని స్వామితో పాటు, దేవాలయం ఆవరణం అంతా చీకటిమయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దేవాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించి, మెరుగైన వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

చిట్టడవిని తలపిస్తున్న ఆస్పత్రి ఆవరణ



ఆస్పత్రి ఆవరణలో అల్లుకుపోయిన కంప చెట్లు

ఈపూరు, ఆగస్టు 25: ఈపూరు సామాజిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో కంప చెట్లు అల్లుకుపోయి చిట్టడవిని తలపిస్తుంది. దట్టంగా పిచ్చి కంప చెట్లు ఉండడంతో పగలు, రాత్రి తేడా లేకుండా విషసర్పాలు ఆవరణలో తిరుగుతున్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగులు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది భయపడుతున్నారు. మార్చురీ గది నుంచి ఆస్పత్రి వరకు కంపచెట్లు అల్లుకుపోయా యి. రాత్రివేళల్లో భయంభయంగా గడపాల్సి వస్తుందని వైద్యులు, సిబ్బంది అంటున్నారు. జనరల్ వార్డు ఎదురుగా పిచ్చికంప చెట్లు గుబురుగా ఉన్నా యి. సిబ్బంది కోసం నిర్మించిన భవనాలు శిథిలమైనప్పటికి కొన్ని భవనాలను కూల్చకపోవడంతో ఆప్రాంతం అంతా చెట్లు పెరిగిపోయాయి. కంపచెట్లను తొలగించాలని రోగులు కోరుతున్నారు.

కలెక్టరేట్‌లో లఖ్‌పతి దీదీ చెక్కుల పంపిణీ



లఖ్‌పతి దీదీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు, 25: మహారాష్ట్రలోని జలగాంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఆదివారం లైవ్ టెలీకాస్ట్ చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్ బాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా లఖ్‌పతి దీదీలో 5184 మందికి ప్రశంసాప్రతాలు, సీఐఎఫ్ రుణాలు రూ.20 లక్షలు, బ్యాంక్ లింకేజీ రుణాలు రూ.54.14 కోట్లు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, పథక సంచాలకులు బాలూనాయక్, లఖ్‌పతి దీదీలు, సీఆర్‌పీలు, మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 25. భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, కలెక్టర్ ఆదేశాల మేరకు హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి 31 వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు క్రీడాభివృద్ధి జిల్లా అధికారి జి.సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్ డోర్ పోటీల్లో వాక్, రేస్ వాలీబాల్, హాకీ (పెనాల్టీ షూట్), మిని ఫుట్‌బాల్, టెన్నిస్‌బాల్ క్రికెట్ ఉంటాయని తెలిపారు. ఇండోర్ పోటీల్లో బ్యాడ్మింటన్, చెస్, బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్ ఉంటాయని చెప్పారు. వీటితో పాటు లెమన్ రేస్ లేదా సాక్ రేస్, రోప్ జంపింగ్, ఖోఖో, లంగరి, ప్లాంక్ ఛాలెంజ్ వంటి సంప్రదాయ క్రీడా పోటీలు ఉంటాయని తెలిపారు. విజేతలకు 29న కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని చెప్పారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలకు ఆసక్తి గల క్రీడాకారులు క్రీడా ప్రాధికార సంస్థ నందు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే 2023 - 2024లో జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను సత్కరిస్తారని, ఆసక్తి, అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 8712622574లో సంప్రదించవచ్చన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి లక్షా21వేల విరాళం



ఆలయ పునర్నిర్మాణం కోసం విరాళం అందజేస్తున్న భక్తులు

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), ఆగస్టు 25: మండలంలోని ఇసప్పాలెం గ్రామంలో ఉన్న మహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణం కోసం ఇసప్పాలెం వాస్తవ్యులు అల్లూరి విఘ్నేశ్వరరావు ధర్మపత్ని మాధవి, కుమారులు జశ్వంత్, గౌతమ్‌లు రూ.1,21,000 విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డికి అందజేశారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను దాతలకు అర్చకులు అందజేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



శావల్యాపురంలో సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

శావల్యాపురం, ఆగస్టు 25: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ పిలుపునిచ్చారు. బీజేపీ మండల ప్రోగ్రాం కన్వీనర్ గట్టుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో శావల్యాపురంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1వతేదీ నుంచి బీజేపీ నాయకులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను, వివిధ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి సాధ్యమైనంత ఎక్కువ సభ్యత్వాలను నమోదు చేయించాలని తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ నాయకులంతా బాధ్యతగా తీసుకోవాలని, బీజేపీ రాష్ట్ర కమిటీ మండలానికి కేటాయించిన లక్ష్యాన్ని సులువుగా అధిగమించాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ప్రోగ్రాం కో-కన్వీనర్‌లు అన్నవరపు శ్రీనివాసరావు, గోగసాని అచ్చయ్య, బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు శివాది వెంకయ్యనాయుడు, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు రావినూతల ఆదాం తదితరులు పాల్గొన్నారు.

అడ్జస్టుమెంట్‌పై ఉపాధ్యాయ సంఘాలు సంతృప్తి



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయ యూనియన్ నాయకులు

వినుకొండ, ఆగస్టు 25: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఆదివారం విద్యాశాఖ అధికారి జఫ్రుల్లా సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల ఎంఈవోపై వర్కు అడ్జస్టుమెంట్‌పై వచ్చిన ఆరోపణల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమక్షంలో చర్చలు జరిపారు. ఎంఈవోపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు. ఉపాధ్యాయులు ఎటువంటి అపోహ చెందాల్సిన అవసరం లేదని యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, యూటీఎఫ్ నాయకులు జిలానీ, ఏపీటీఎఫ్ నాయకులు టి.శివనాగరాజు, కృపదాసు, ప్రకాష్, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐని కలిసిన పేరూరుపాడు గ్రామస్థులు

బొల్లాపల్లి, ఆగస్టు 25: బొల్లాపల్లి మండల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆవుల బాలకృష్ణను పేరూరుపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, పలువురు గ్రామస్థులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు అందరూ సహకరించాలని వారిని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ అచ్యుత సుధాకర్‌ను కూడా వీరు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. కలసిన వారిలో కాట్ల వెంకటేశ్వర్లు, అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, గరికపాటి నాగేశ్వరరావు, గరిక పాటి శరత్, గుర్రం నరసింహారావు, కాట్ల చినకొండలు, రాచపల్లి మునిబాబు, పిట్టల చినగోవిందు, నూజెండ్ల హనుమంతరావు తదితరులు ఉన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



స్టడీ మెటిరీయల్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

స్టడీ మెటిరీయల్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

మాచర్లటౌన్, ఆగస్టు 25: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నివాసంలో ఆదివారం యూటీఎఫ్ నేతలు ఎమ్మెల్యేను కలిసి ఎమ్మెల్సీ లక్ష్మణరావు రూపొందించిన 125 పేజీల టెట్, డీఎస్సీలకు ఉపయోగపడే మనో విజ్ఞానశాస్త్ర స్టడీ మెటిరీయల్‌ను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిచే ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ప్రధానకార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శులు నాసరరెడ్డి, ఆయేషా సుల్తానా, గాలీబు, పట్టాభి రామారావు, నాగరాజు, బూసా శ్రీనివాసరావు, శాంతిబాయి, చోక్లానాయక్, శంకర్‌నాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల సేవలను వివరించండి

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,ఆగస్టు 25 : పాఠశాలల్లో అమలవుతున్న వివిధ రకాల పథకాలకు కూటమి ప్రభుత్వం మహనీయుల పేర్లను పెట్టిందని, వారి గొప్పతనాన్ని, వారి సేవలను విద్యార్థులకు తెలియచేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. ఆదివారం గుంటూరు వెళ్తున్న ఎమ్మెల్యే రెంటచింతలలో ఆగి విలేకరులతో మాట్లాడారు. జగనన్న అమ్మ ఒడి.. తల్లికి వందనంగా, జగనన్న గోరు ముద్ద.. డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనంగా, జగనన్న విద్యాకానుక.. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రగా, మనబడి నాడు నేడు.. మన బడి-మన భవిష్యత్‌గా, స్వేచ్ఛ పథకానికి.. బాలికా సురక్షగా, జగనన్న ఆణిముత్యాలు.. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారంగా కూటమి ప్రభుత్వం మార్చిందన్నారు. సెప్టెంబరు 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం సదర్భంగా విద్యార్థులకు ఈ పథకాలకు పెట్టిన మహనీయుల పేర్లు, వారి జీవిత విశేషాలను తెలియ చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట వెంట టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, రామకృష్ణ, కృష్ణారెడ్డి,రాయపరెడ్డి తదితరులు ఉన్నారు.

రాజారత్నంకు టీడీపీ ప్రశంసా పత్రం

మాచర్లటౌన్, ఆగస్టు25: పట్టణానికి చెందిన టీడీపీ నేత చల్లా రాజారత్నం టీడీపీ యాప్ ద్వారా టీడీపీ కంటెంట్‌ను ప్రజలకు విస్తృతస్థాయిలో షేర్ చేసి టాప్ పెర్ఫార్మర్‌గా నిలవడంతో ఆయనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నారా లోకేశ్‌లు ప్రశంసాపత్రం అందజేశారు. యాప్‌ను మరింతగా ప్రజలకు చేరువ చేయాలని, రాష్ట్ర ఇమేజ్‌ను దెబ్బతీయడానికి జగన్ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలను తెలియజేయడంలో అప్రమత్తంగా ఉండాలని ప్రశంసాపత్రంలో పేర్కొన్నారు. ఈ ప్రశంసాపత్రాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో రాజారత్నంకు అందించి అభినందించారు.

ఎఫ్ఏ పరీక్ష పేరు ఎస్ఏగా మార్పు..

రెంటచింతల,ఆగస్టు 25 : ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ) పరీక్ష పేరును సెల్ఫ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ)గా కూటమి ప్రభుత్వం మార్పు చేసిందని, ఈనెల 27 నుంచి ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు సత్తెనపల్లి డిప్యూటీ ఈవో ఏసుబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు తరగతిగది మూల్యాంకనం (సీబీఏ)పద్ధతిలో ఓఎంఆర్‌లతోను, 9,10 తరగతులకు రెగ్యులర్ పద్ధతి నాన్ సీబీఏ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారని, ఇందుకు సంబంధించి ప్రశ్నాపత్రాలు ఆయా మండల కేంద్రాలకు చేరాయన్నారు. ప్రశ్నాపత్రం ఏ రూపంలోనైనా లీకైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరీక్షలు ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రమే జరుగుతాయని, ప్రైవేట్ పాఠశాలలకు ఏ విధమైన ప్రశ్నాపత్రాలు ఇవ్వమని ఏసుబాబు స్పష్టం చేశారు.

మండల సెంట్రింగ్ వర్కర్స్ కమిటీ ఎన్నిక

దాచేపల్లి, ఆగస్టు 25: దాచేపల్లి మండల సెంట్రింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గుంటుపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం దాచేపల్లిలో నిర్వహించారు. ఈ సదర్భంగా అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా వినుకొండ ఏసుబాబు, ప్రధాన కార్యదర్శిగా కొర్రపాటి మరియన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే సంఘ గౌరవ అధ్యక్షుడిగా గుంటుపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా పలుకూరి రాము, సహాయ కార్యదర్శిగా వీరా కొండలు, సంయుక్త కార్యదర్శిగా దేవళ్ల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా బండ్ల పూర్ణ, మరో 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. గుంటుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సెంట్రింగ్ వర్కర్స్ ఐక్యంగా ఉండి ప్రభుత్వం నుంచి అమలయ్యే సంక్షేమ పథకాలను కార్మికులందరికీ అందేలా చూడాలన్నారు. సమావేశంలో 30 ఏళ్లుగా అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికవుతూ ప్రస్తుతం గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన గుంటుపల్లి వెంకటేశ్వర్లును సభ్యులందరూ శాలువాతో సన్మానించారు.



రామాపురం గ్రామంలో ముత్యాలమ్మతల్లికి బోనాలు తీసుకెళ్తున్న మహిళా భక్తులు

ముత్యాలమ్మతల్లికి బోనాలు

దాచేపల్లి, ఆగస్టు25: పాడి పంటలను, పశు సంపదను కాపాడాలని, కరవు కాటకాలను తొలగించాలని కోరుతూ మండలంలో రామాపురం, నారాయణపురంలోని ఎంఎస్‌పేటలో కొలువైన ముత్యాలమ్మతల్లికి మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామస్థులందరూ కులమతాలకు అతీతంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



రోటరీక్లబ్ వైద్యశిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

పిడుగురాళ్ల, ఆగస్టు 25: శంకర కంటి వైద్యశాల, పిడుగురాళ్ల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 300 మందిని పరీక్షించిన వైద్యులు 250 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. వారందరినీ దశల వారీగా శంకర కంటి వైద్యశాలకు ఉచితంగా తీసుకెళ్లి ఆపరేషన్ అనంతరం తిరిగి పిడుగురాళ్లకు తీసుకురానున్నట్లు క్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు, కార్యదర్శి నీరుమళ్ల రాజేష్, కోశాధికారి డాక్టర్ గుర్రం కృష్ణకాంత్‌లు తెలిపారు. కార్యక్రమంలో గర్రె సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, సాంబశివరావు, హరికృష్ణ, నారాయణ, మురళీ, రాజేష్, పాపయ్య గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు

మహా మట్టి గణపతి ..



సత్తెనపల్లి ఆగస్టు 25: వినాయక చవితి వేడుకలకు పట్టణంలో మహా మట్టి గణపతి విగ్రహం రూపుదిద్దుకుంటోంది. నాగార్జున నగర్‌కు చెందిన శ్రీ సత్యసాయి యువజన సంఘ సభ్యులు 61 అడుగుల ఎత్తైన మట్టి వినాయకుడి ప్రతిమను నిర్మిస్తున్నారు. ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా మట్టి కొబ్బరి తాళ్ళు కర్రలతో సినీ ఆర్టు డైరెక్టర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో కార్మికులు విగ్రహ నిర్మాణ పనులు చేస్తున్నారు. రూ.7లక్షల వ్యయంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. సెప్టెంబరు 4వ నాటికి పనులు పూర్తవుతాయని తెలిపారు.

నిబంధనలకు నీళ్లు

అనుమతులు లేవు, నిబందనలు పాటించాల్సిన పని లేదు, భూమి కన్పించిదా? వెంచర్ వేయటం, ప్లాట్లు అమ్మేయటం గత వైసీపీ ప్రభుత్వ ఐదు సంవత్సరాల పాలనలో జరిగింది ఇదే. ప్రతి వెంచర్లలో వైసీపీ నాయకులకు కమీషన్‌లు ముట్టాయి. దీంతో ఎవ్వరూ పట్టించు కోలేదు. ఇదేమి న్యాయం అని అడగలేదు. అధికారులకు అందాల్సినవి అందాయి. వారు నోరు మెదపలేదు. కానీ ఆ ప్లాట్లు కొన్న వారు దగా పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అక్రమ వెంచర్లపై కొరడా ఝులిపిస్తోంది.

- అడ్డగోలుగా అనధికార వెంచర్లు
- వైసీపీ హయాంలో అక్రమంగా ప్లాట్ల వ్యాపారం
- భూ అక్రమార్కులపై కూటమి కన్నెర్ర
- ప్రభుత్వ ఆదేశాలతో కొరడా ఝులిపిస్తున్న అధికారులు



పట్టణ పరిధిలోని ఓ అక్రమ వెంచర్

సత్తెనపల్లి, ఆగస్టు 25 : సత్తెనపల్లి పట్టణంలోని పలు ప్రాంతాల్లో అనధికార వెంచర్లు పటట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. కొంత మంది ఇష్టారీతిన లే అవుట్‌లు వేశారు. అయితే వెంచర్ వేయాలంటే పంట భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలి. మార్కెట్ విలువలో ఐదు శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. వెంచర్లలో రోడ్లు, పార్కు, ఖాళీ స్థలం ఉండాలి. చుట్టూ ఫైరింజన్ వంటి వాహనాలు తిరగటానికి స్థలం వదలాలి. అలా చేస్తే ఎకరం భూమిలో దాదాపు 40 శాతం స్థలం పోతుంది. ఈ నిబందనలను పాటిస్తే తమకు లాభం తగ్గుతుందని భావించిన వ్యాపారులు పలువురు నిబందనలు పాటించకుండా ప్లాట్లు వేశారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం దక్కటంలేదు. రిజిస్ట్రేషన్‌శాఖ వెంచర్‌కు అనుమతి ఉన్నది లేనిది చూసుకోకుండానే అక్రమ వెంచర్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తుంది. విద్యుత్ శాఖ కనెక్షన్‌లు ఇస్తుంది. మొత్తానికి శిలాపాపం తలా పిడికెడు అన్న చందాగా అన్ని శాఖలు కలసి ప్రభుత్వ ఆదాయానికి గండి పెట్టడమే కాకుండా సామాన్యులను ఇబ్బంది పెట్టారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అక్రమ లే అవుట్‌లపై పూర్తిస్థాయి దృష్టి సారించింది. అక్రమ వెంచర్ల వ్యవహారం ఇప్పటి వరకు కొనసాగింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం అధికారులు తాము అక్రమ వెంచర్లను గుర్తించామని, వాటిలో ఎవ్వరూ కూడా ప్లాట్లు కొనుగోలు చేయకూడదని హెచ్చరికలు జారీ చేశారు.

పట్టణంలోని వడ్డవల్లిలో 245, 131, 108, 127, 128, 241/బీ, 239/ఏ1, 123, 125, 126, 289, 292, 293, సత్తెనపల్లి పట్టణంలోని 106, 107, 108, 131, 105, 80/ఏ, 132, 131, 77, 85, 45, 40, 46, 47, 23, 26, 37, 13, 14, 65, 73, 74, 222, 230, 40, 231, 362-3, 365-1సీ, 2ఏ, 145ఏ1, 146-1, 338-1ఏ, 142, 143, 144 సర్వే నెంబర్లలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్లాట్లు వేశారని మునిసిపల్ కమిషనర్ షమ్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా సర్వే నెంబర్లలోని ప్లాట్లు కొనుగోలు చేయటం చట్ట విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఆ సర్వే నెంబర్లలోని ప్లాంట్లలో ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయటం లేదన్నారు. రోడ్లు, విద్యుత్, నీరు, డ్రెయినేజ్ వంటి సదుపాయలు కల్పించమని స్పష్టం చేశారు. అనధికారికంగా లే అవుట్లు వేసిన, అమ్మకాలు చేస్తున్న స్థల యజమానులపై, డెవలప్పర్స్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవటం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు.



ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రైతులంతా సుభిక్షంగా ఉండాలి

● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, ఆగస్టు 25: ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడి పాడి పంటలతో రైతులంతా సుభిక్షంగా ఉండాలని, పాతపాటేశ్వరి అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని చింతపల్లిలో వేంచేసియున్న పాతపాటేశ్వరమ్మ అమ్మవారికి గ్రామస్థులు బోనాలు సమర్పించారు. ఈ వేడుకలకు విచ్చేసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి పెదకాపు ఉన్నం శ్రీనివాసులు స్వాగతం పలికి దుశ్శాలువలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లాకార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సుందరరావు, ఉన్నం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మాచవరం: మాచవరంలో వేంచేసియున్న పాతపాటేశ్వరి అమ్మవారు, వేమవరంలో వేంచేసియున్న ముత్యాలమ్మతల్లి దేవతలను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



లకపతి దీదీ ధ్రువపత్రాను అందజేస్తున్న అధికారులు

లకపతి దీదీ ధ్రువపత్రాలు అందజేత

అచ్చంపేట, ఆగస్టు 25 : స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో లకపతి దీదీ కార్యక్రమం ద్వారా మండలంలోని 3 వేల మంది మహిళలను తీసుకున్నామని, వారిలో 20 మందికి ఆదివారం ధృవపత్రాలను అందజేశామని ఏపీఎం సలీం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన లక్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా ఒక్కొక్క మహిళకు ముద్ర లోన్‌లు, బ్యాంకు లోన్‌ల ద్వారా రూ.లక్ష చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ, సీసీలు ఎస్‌కే సైదా, నరసింహారావు, బాజీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలను బలవంతంగా పంపొద్దు

రెంటచింతల,ఆగస్టు 25 : ఎస్‌జీటీలను బలవంతంగా హైస్కూళ్లకు పంపొద్దని, ఉపాధ్యాయుల అంగీకారంతోనే సర్దుబాబు చేయాలని యూటీఎఫ్, ఎస్‌టీయూ నేతలు డాక్టర్ చిన్నమ్మ, జాన్ విజయ్‌రాజ్ కుమార్, లేళ్ల శ్రీనివాసరావు, చంద్రశేఖర శర్మ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఉపాధ్యాయుల పని సర్దుబాటును మండలానికే పరిమితం చేయాలని సూచించారు. ఉద్యోగులకు దసరా కానుకగా మధ్యంతర భృతిని 30 శాతంగా ప్రకటించాలని కోరారు.

షుగర్ వ్యాధిగ్రస్థులకు కంటి పరీక్షలు

మాచర్లటౌన్, ఆగస్టు 25: పట్టణంలోని డాక్టర్ రామలింగారెడ్డి మాక్సీవిజన్ కంటి ఆసుపత్రిలో ఆదివారం షుగర్ వ్యాధిగ్రస్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ రెటీనా స్పెషలిస్టులు డాక్టర్ చెంచిరెడ్డి, డాక్టర్ హరిత, డాక్టర్ అనీషాప్రియా షుగర్ వ్యాధితో కంటి చూపు దెబ్బతిన్న 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

29న నూతన భవనంలోకి సీజీజీబీ

నకరికల్లు, ఆగస్టు 25 : చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు (సీజీజీబీ) నకరికల్లు శాఖను ఈనెల 29వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు నూతన భవనంలో ప్రారంభిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ కోడె రాంశాయిచంద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఛైర్మన్ కే.ప్రమోద్ కుమార్‌రెడ్డి, జనరల్ మేనేజర్లు పీ.మారుతీరామ్, పీ.వీరారెడ్డిలు, రీజనల్ మేనేజర్ వర్ల శ్రీనివాస్ తదితరులు హాజరుకానున్నారని తెలిపారు.

ఉపాధి కోర్సులో ఉచిత శిక్షణ

నకరికల్లు, ఆగస్టు 25 : స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనుకొనే గ్రామీణ ప్రాంత యువకులకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జీబీ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులకు నెల రోజుల పాటు ఉచిత హాస్టల్ వసతి, భోజన సదుపాయం కల్పించి, రిఫ్యుజరేషన్, ఏసీ సర్వీసింగ్ కోర్సులో శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల మధ్యలో ఉండాలని సూచించారు. సెప్టెంబరు 2 నుంచి శిక్షణ ప్రారంభ మవుతుందన్నారు. మరిన్ని వివరాలకు 8125397953, 9700687696, 9949930155 నంబర్లలో సంప్రదించాలన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏపీఆర్‌జేసీలో ఉచిత వైద్యశిబిరం

మాచర్లరూరల్, ఆగస్టు 25: మండలంలోని విజయపురిసౌత్ ఏపీఆర్‌జేసీలో గోల్డెన్‌జూబ్లీని పురస్కరిచుకొని ఆదివారం సాగర్ పరివార్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు బీపీ, డెంటల్, స్కిన్, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, రుమటాలజీలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. 50 మందికి కళ్ల పరీక్షలు జరిపి 20 మందికి కళ్లజోళ్లను అందించారు. కార్యక్రమంలో సాగర్ పరివార్ ప్రెసిడెంట్ మల్లికార్జునరావు, జనరల్ సెక్రటరీ వీరనంది, ట్రెజరర్ విజయకుమార్, క్యాంపు కోఆర్డినేటర్ డాక్టర్ చక్రపాణి, వైస్ ప్రెసిడెంట్ సైదారెడ్డి, నాగాచారి, విశ్రాంత డీజీపీ వెంకటేష్, దంత వైద్యుడు వివేకానందవర్ధన్, ప్రిన్సిపాల్ సరోజిని, అధ్యాపకులు పాల్గొన్నారు.



తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

సాగరమాత ఆలయంలో ప్రార్థనలు

మాచర్ల రూరల్, ఆగస్టు 25: మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగరమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయ విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్ భక్తులకు దైవ సందేశమందించారు. సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు మెండుగా ఉంటాయన్నారు. అనంతరం దివ్య బలిపూజ, తేరు ప్రదక్షిణలు గావించారు. భక్తులు ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

విజృంభిస్తున్న జ్వరాలు

- మండలంలోని మూడు గ్రామాల్లో అధికంగా రోగులు
- ఊటుకూరులో టీడీపీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

క్రోసూరు, ఆగస్టు 25 : మండలంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రధానంగా ఊటుకూరు, బయ్యవరం, నాగవరం గ్రామాల్లో వారం రోజుల నుంచి జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఇంట్లోను జ్వర పీడితులు ఉన్నారని ప్రజలు చెబుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటంతో దోమలు వ్యాపించి జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం ఊటుకూరు గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి వేగుంటరాణి పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన ఈ వైద్యశిబిరంలో వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఊటుకూరు గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఇన్నారావు, డాక్టర్ సిరి చందన గ్రామంలో ఇంటింటికి తిరిగి నీటి తొట్లు,



వైద్య శిబిరంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కూలర్లు, పరిసరాల్లో నిల్వవున్న నీటిని పారబోయించారు. గామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లోని జ్వర పీడితులు క్రోసూరు, అమరావతి, సత్తెనపల్లి, గుంటూరు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. ఊటుకూరులో సుమారు 50 మంది వరకు జ్వర పీడితులు ఉన్నారని, వారందరి ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, అవసరమైతే రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో అన్ని రకాల మందులను సిద్ధం చేసినట్లు డాక్టర్ సిరిచందన తెలిపారు.



ఎమ్మెల్యే కన్నా, స్పీకర్ అయ్యన్న పాత్రుడులను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

ఎమ్మెల్యే కన్నాను కలిసిన స్పీకర్

సత్తెనపల్లి ఆగస్టు 25: సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను ఆదివారం గుంటూరులోని ఆయన నివాసంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు ఎమ్మెల్యే కన్నా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం టీడీపీ నేతలు అయ్యన్నపాత్రుడు, కన్నాలను గజమాలతో సత్కరించారు.

రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలి

సత్తెనపల్లి, ఆగస్టు 25 :మండలంలోని రైతులు వెంటనే ఈ పంట నమోదు చేయించుకోవాలని జరుగుతుందని ఏవో శ్రీధర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వ పరంగా అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. కొత్తమంది రైతులు నమోదుకు దూరంగా ఉండటంతో నష్ట పోతున్నారన్నారు. అంతర్ సాగు హక్కు పత్రాలు పొందిన కౌలు రైతులకు కూడా ప్రభుత్వం ఈ సారి అవకాశం కల్పించిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ పంట నమోదు జరుగుతుందన్నారు. ముందుగా రైతు సేవా కేంద్రాల్లో పంట వివరాలు తెలిపి నమోదు చేయించు కోవాలన్నారు. సాగు చేస్తున్న పంట రకం, విస్తీర్ణం, సర్వే నెంబర్లు, పట్టా దారు పాసు పుస్తకం, ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు అందజేయాలన్నారు. అనంతరం భూమి జియో ఫెన్సింగ్ జరుగుతుందన్నారు. సెప్టెంబరు 15 వరకు ఈపంట నమోదు జరుగుతుందని, గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఏవో శ్రీధర్ రెడ్డి సూచించారు.



ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, లావణ్య దంపతులు

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు

● ఆలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఆగస్టు 25: బెల్లంకొండ గ్రామస్థులంతా భక్తిశ్రద్ధలతో ఐకమత్యంతో బోనాల వేడుకలను నిర్వహించుకోవటం మంచి విషయమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం స్థానిక లక్ష్మీ తిరుపతమ్మతల్లి గోపయ్య స్వామి ఆలయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఆయన సతీమణి లావణ్యలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భారీగా బోనాలు తీసుకు వెళ్ళి అమ్మవారికి సమర్పించారు. వేడుకలను తిలకించేందుకు ఇతర గ్రామాల నుంచి భారీగా భక్తులు విచ్చేవారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అలాగే మిర్చియార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, పీఎస్‌కే రసూల్, గంగారావు, సయ్యద్ జానీ, సుభానీ, ఎన్.పిచ్చయ్య, వెన్నా సీతారామిరెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, తెల్లమేకల నాగేశ్వరరావు, గురవయ్య, మల్లికార్జునరావు, కోటేశ్వరరావు, హనుమంతరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు: మండలంలోని 75తాళ్ళూరు శాంతికాలనీలోని అమ్మవారికి ఆదివారం మహిళలు బోనాలు సమర్పించారు. ముత్యాలమ్మ తల్లిని తొలుత అలంకరించి పూజలను నిర్వహించారు. ప్రతి ఏటా బేడ బుడగజంగం కాలనీలో శ్రావణమాసంలో ముత్యాలమ్మతల్లికి బోనాలు సమర్పిం చటం ఆచారంగా వస్తుందని కులపెద్దలు కిన్నెర అచ్చయ్య, గంధం బిక్షాలు తెలిపారు.

లక్కీడ్రా స్కీం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కారంపూడి, ఆగస్టు 25: శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యాన గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే లక్కీ డ్రా స్కీం వాల్‌పోస్టరును గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆవిష్కరించారు. మొదటి బహుమతిగా ఫ్రిజ్, రెండో బహుమతిగా 2 గ్రాముల బంగారం, మూడో బహుమతిగా ఎల్ఈడీ టీవీతో పాటు ఆరు కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ ఆర్యవైశ్య యువజన సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

గ్రామసభలు విజయవంతం

● జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రామాంజనేయులు

మాచర్లటౌన్, ఆగస్టు 25: మాచర్ల నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన ఉపాధిహామీ గ్రామసభలు విజయవంతమైనట్లు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో అభివృద్ధిలో జాడలేక గ్రామాలు ప్రాణాలు కోల్పోయాయన్నారు. కూటమి ప్రభుత్వంలో మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం వైపు అడుగులు వేస్తున్నామన్నారు. స్వర్ణ గ్రామ పంచాయతీ చొరవతో కూటమి ప్రభుత్వం ఒక్క రోజే 13,226 పంచాయతీల్లో గ్రామసభలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్ కల్యాణ్ ప్రతి పంచాయతీలోని ప్రజలు తమ గ్రామ అభివృద్ధికి నిధుల ఖర్చుపై తీర్మాణాలు చేయాలని సూచించారన్నారు. గతంలో కాగితాలకే పరిమితమైన గ్రామసభలను ఆచరణలోకి తీసుకొచ్చారన్నారు. సర్పంచ్ అధ్యక్షత గ్రామసభల్లో రూ. 4500 కోట్లతో ఉపాధిహామీ పనులకు ప్రజలు తీర్మాణాలు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రికార్డు స్థాయిలో కోటి మందికి పైగా గ్రామసభల్లో పాల్గొని ఉపాధిహామీ పనులకు ఆమోదం తెలిపారన్నారు. ఉపాధిహామీ పనులకు వ్యవసాయాన్ని అనుసంధానం చేసి రైతులకు అండగా నిలవడంతో అన్నదాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. గ్రామసభల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు పాల్గొని గ్రామసభలను విజయవంతం చేశారన్నారు.



మిరప నారును పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి ఎనిబెరా మోహన్

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● ఉద్యాన అధికారి వై.మోహన్ ● నర్సరీల్లో మిరప నారు పరిశీలన

రెంటచింతల,ఆగస్టు 25 : మిరప నారులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ శాఖాధికారి ఎనిబెరా మెహన్ అన్నారు. ఆదివారం రెంటచింతలలో వివిధ మిర్చి నర్సరీల్లో సాగవుతున్న నారును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా చీడపీడలను అరికట్టవచ్చన్నారు. రైతులకు నారు విక్రయించేటప్పుడు తప్పని సరిగా రసీదు ఇవ్వాలని, మొక్కల ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, లైసెన్స్ లేకుండా నారు విక్రయించకూడదని సూచించారు. ఉద్యానశాఖ ద్వారా పూల, పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలందిస్తోందని తెలిపారు. అదే విధంగా డ్రిప్, స్ప్రింకర్లకు కూడా రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం ఆరంభమైందని, ఆసక్తి వున్న రైతులు రైతు సేవా కేంద్రాల లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.